# విశాల భారతి

తెలుగు దినపత్రిక

23-04-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

గురువారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 112


## గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్‌గా హైదరాబాద్



- ఒప్పంద కంపెనీలకు త్వరగా భూములివ్వాలని సీఎం ఆదేశం
- సంస్థలను విభజించి ప్రముఖ వాటికి ప్రాధాన్యం
- డేటా సెంటర్లు శుద్ధి చేసిన నీటిని వాడేలా ప్లాన్
- కంపెనీలు త్వరగా కార్యకలాపాలు మొదలుపెట్టేలా చూడాలి
- భూ కేటాయింపుల వివరాలపై అధికారుల వివరణ
- పెట్టుబడిదారులకు అవసరమైన వసతులపై పక్కా ప్రణాళిక

02

## రోడ్డున పడ్డ సామాన్యుడి ప్రయాణం




- నాడు కేసీఆర్.. నేడు రేవంత్ మాట తప్పారు
- 32 డిమాండ్ల కోసం బస్సులు బంద్
- ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి
- ప్రభుత్వ చర్చలు ఫలించక సమ్మె ప్రారంభం
- కాంగ్రెస్ పాత హామీని అమలు చేయాలని పట్టు

03

## మంత్రి ఉత్తమ్ చేతులెత్తేశారా!



- బాధ్యులైన ఇంజినీర్లపై కఠిన చర్యలకు సిఫారసు
- వేల కోట్ల నష్టానికి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సూచన
- ఏడాది దాటినా నివేదికపై ప్రభుత్వం మౌనం
- పనులు ఆగిపోతాయన్న సాకుతో చర్యల్లో జాప్యం
- కోట్లాది రూపాయల ఆస్తులు దొరికినా శిక్షలు శూన్యం
- కమిషన్ల పేరుతో దోషులను కాపాడుతున్నారని ఆరోపణలు

03



# కేసులన్నీ లొట్టపీసు ఏనా?

జస్టిస్ ఘోష్ నివేదికను హైకోర్టు కొట్టేసింది

- నిందితుల వివరణ తీసుకోకపోవడాన్ని తప్పుపట్టింది
- కేసీఆర్, హరీష్‌లపై చర్యలు తీసుకోవడం కుదరదు
- ఇది తమకు న్యాయ విజయమని బీఆర్ఎస్ అంటోంది
- కమిషన్ విచారణ తీరును అంగీకరించలేదు
- ఇప్పుడు సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశం కనిపిస్తోంది

తెలంగాణ రాజకీయ ముఖచిత్రంపై ఇప్పుడు కేవలం విచారణల పర్వమే కాకుండా, ఆ విచారణల విశ్వసనీయతపై కూడా పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి, అవకతవకలపై దాదాపు ఏడాదిన్నర కాలం పాటు అహోరాత్రులు శ్రమించి జస్టిస్ పీసీ ఘోష్ సిద్ధం చేసిన నివేదికను హైకోర్టు తప్పుపట్టడం రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనానికి దారితీసింది. దశాబ్దాల పాటు న్యాయమూర్తిగా, చట్టసభల పనితీరుపై అవగాహన ఉన్న ఒక అనుభవజ్ఞుడు ఇచ్చిన నివేదికలో సాంకేతిక లోపాలు ఎలా దొర్లాయి అన్నది ఇప్పుడు అందరినీ వేధిస్తున్న ప్రధాన ప్రశ్న. విచారణా క్రమంలో పాటించాల్సిన కనీస నిబంధనలు లేదా ప్రొసీజరల్ ల్యాప్సెస్ ఉండకూడదన్న కనీస జాగ్రత్తను కమిషన్ ఎందుకు తీసుకోలేకపోయిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైకోర్టు ఈ నివేదికను కొట్టివేయడం ద్వారా ప్రభుత్వానికి ఒక గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లయింది. ఈ పరిణామం కేవలం కాళేశ్వరం కేసుకే పరిమితం కాకుండా, ప్రస్తుత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న టెలిఫోన్ ట్యాపింగ్, ఫార్ములా రేస్ కేసుల విధివిధానాలపై కూడా నీలి నీడలు కమ్ముకునేలా చేసింది. జస్టిస్ ఘోష్ వంటి అత్యున్నత స్థాయి అధికారి చేపట్టిన విచారణే న్యాయస్థానంలో వీగిపోయినప్పుడు, ఇక పోలీసు అధికారులు లేదా దర్యాప్తు సంస్థలు ఇచ్చే నివేదికలు కోర్టు బోనులో నిలబడ గలవా అన్న ఆందోళన రాజకీయ వర్గాల్లో మొదలైంది. ట్యాపింగ్ కేసులో కీలక ఆధారాలు ఉన్నాయని, అనేక మంది అధికారులు ఇందులో భాగస్వాములయ్యారని ఏసీబీ, ఈడీ లాంటి సంస్థలు ప్రాథమికంగా నిర్ధారించినప్పటికీ,

మిగతా 3లో..



## పోలీసుల వేధింపులు: లక్ష్మీప్రియా కాలనీ ప్రెసిడెంట్ ఆత్మహత్య

వేధింపులు తట్టుకోలేక కాలనీ అధ్యక్షుడు మధు ఉరివేసుకున్నారు




- మాజీ అధ్యక్షుడు యాదగిరి గౌడ్, పోలీసులు కారణమని సూసైడ్ నోట్
- కాలనీ నిధులు, ఫోర్జరీ కేసు వివాదమే వేధింపులకు మూలం
- మృతదేహంతో నిందితుడి ఇంటి ముందే బంధువుల నిరసన
- జాడలేని సీఐ, ఎస్ఐ
- ఘటనా స్థలంలో భారీగా పోలీసులు మోహరింపు
- ఉదయం నుంచి పోలీస్ స్టేషన్లో హైడ్రామా

02

## ద్రవిడ గడ్డపై గెలుపు ఎవరిది?

- డీఎంకే, అన్నాడీఎంకే వర్సెస్ విజయ్ మధ్య పోరు
- రాష్ట్ర పారిశ్రామిక వృద్ధికి ఈ ఎన్నికలు అత్యంత కీలకం
- స్పష్టమైన మెజారిటీ రాకపోతే అస్థిరత వస్తుందని ఆందోళన
- టీవీకే ఓట్ల చీలిక ఫలితాలను మార్చే అవకాశం ఉంది
- ఇన్వెస్టర్ల నమ్మకం పెరగాలంటే బలమైన ప్రభుత్వం అవసరం
- నేడే పోలింగ్, మే 4న తుది ఫలితాలు వెలువడనున్నాయి

02



## ఆర్టీసీ సమ్మె వెనుక హరీశ్



- ఆర్టీసీ సమ్మె వెనుక హరీశ్ రావు హస్తం ఉంది
- జేఏసీ నేతలను ప్రతిపక్షాలే తప్పుదోవ పట్టిస్తున్నాయి
- 32 డిమాండ్లలో 29 అంశాలకు ప్రభుత్వం ఓకే చెప్పింది
- సమస్యల పరిష్కారానికి 4 వారాల సమయం కావాలి
- మహాలక్ష్మి పథకం సక్సెస్ కావడం నచ్చకే ఈ కుట్రలు
- పాత పగలు మరిచి కార్మికులు సమ్మె విరమించాలి

03



## పొన్నం ప్రభాకర్‌పై శ్రీధర్ బాబు కుట్ర..?

- మేనిఫెస్టో వాగ్దానాలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలి
- రెండున్నరేళ్లు వేచి చూశాకే కార్మికులు సమ్మెకు దిగారు
- సమ్మె వెనుక తమ కుట్ర ఉందన్న ఆరోపణలను కొట్టేసారు
- హామీలు రాసిన శ్రీధర్ బాబు ఒకసారి మేనిఫెస్టో చదవాలి
- ముగిసినా సమస్యలు తీర్చకపోవడం ప్రభుత్వ అసమర్థతే

04

## కాళేశ్వరం విషయంలో రేవంత్ ఫెయిల్

- విచారణలో రేవంత్ ప్రభుత్వం 'అట్టర్‌ఫ్లాప్' అయింది
- కేసీఆర్‌ను కాపాడటానికే కోర్టులో నిలవని రిపోర్టు ఇచ్చారు
- ఆధారాలున్నా నిరూపించలేకపోవడం ప్రభుత్వ చేతగానితనం
- కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒప్పందం వల్లే చర్యలు లేవు
- రెండేళ్లు దాటినా ఒక్క అవినీతిపరుడిపై కూడా వేటు పడలేదు
- ఈ తీర్పుపై రాహుల్, రేవంత్ ప్రజలకు సమాధానం చెప్పాలి

02

GENERAL news
WWW.VISHALABHARATI.COM
విశాల భారతి



# పోలీసుల వేధింపులు
# లక్ష్మీ ప్రియా కాలనీ ప్రెసిడెంట్ ఆత్మహత్య

## వేధింపులు తట్టుకోలేక కాలనీ అధ్యక్షుడు మధు ఉరివేసుకున్నారు

- మాజీ అధ్యక్షుడు యాదగిరి గౌడ్, పోలీసులు కారణమని సూసైడ్ నోట్
- కాలనీ నిధులు, ఫోర్జరీ కేసు వివాదమే వేధింపులకు మూలం
- మృతదేహంతో నిందితుడి ఇంటి ముందే బంధువుల నిరసన
- జాడలేని సీఐ, ఎస్ఐ
- ఘటనా స్థలంలో భారీగా పోలీసులు మోహరింపు
- ఉదయం నుంచి పోలీస్ స్టేషన్లో హైడ్రామా



**హయత్‌నగర్ పరిధిలోని లక్ష్మీప్రియా కాలనీలో నిధుల దుర్వినియోగం, ఫోర్జరీ ఆరోపణల నేపథ్యంలో చోటుచేసుకున్న వివాదం ఒక నిండు ప్రాణాన్ని బలిగొంది. కాలనీ ప్రస్తుత అధ్యక్షుడు మధు సిఐ నాగరాజు, ఎస్ఐ లక్ష్మీ నారాయణ మాజీ అధ్యక్షుడు యాదగిరి గౌడ్ వేధింపులు భరించలేక తన ఇంట్లోనే ఉరివేసుకుని ప్రాణాలు విడిచారు. సమాజంలో గౌరవప్రదమైన స్థానంలో ఉండి కాలనీ సంక్షేమం కోసం పాటుపడుతున్న తనను ఒక తప్పుడు కేసులో ఇరికించి, బెయిల్ వచ్చినా విడవకుండా వేధించడం వల్లే ఈ అఘాయిత్యానికి పాల్పడుతున్నట్లు ఆయన తన సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు.**

**హయత్‌నగర్, విశాలభారతి:**

మధు మరణవార్తతో కాలనీలో ఒక్కసారిగా నిశ్శబ్దం అలుముకోగా, బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ బంధువులు రోడ్డుపైకి రావడంతో లక్ష్మీప్రియా కాలనీ రణరంగంగా మారింది. ఈ వివాదానికి మూలాలు కాలనీ నిధుల నిర్వహణలో ఉన్నాయి. మాజీ అధ్యక్షుడు యాదగిరి గౌడ్ కాలనీ నిధులను సొంతానికి వాడుకుంటున్నారని కమిటీ సభ్యులు ఆరోపిస్తూ ఆయనను పదవి నుంచి తొలగించి మధును నూతన అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ క్రమంలో జరిగిన లెక్కల పరిష్కారంలో భాగంగా యాదగిరి గౌడ్ ఒక లక్ష రూపాయల చెక్కును మధుకు, గణేష్ అనే వ్యక్తికి అందజేశారు. అయితే, సదరు చెక్కును ఫోర్జరీ చేసి తన ఖాతా నుంచి ఏకంగా 9 లక్షల రూపాయలు డ్రా చేశారంటూ యాదగిరి గౌడ్ మార్చి 16వ తేదీన హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఆరోపణలపై పోలీసులు కేసు నమోదు చేయడంతో మధు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. చట్టపరమైన పోరాటంలో భాగంగా మధు, గణేష్ ఈ నెల 10వ తేదీన కోర్టు నుంచి బెయిల్ పొందారు. అయినప్పటికీ పోలీసుల వేధింపులు తగ్గలేదు. నకరికల్లు నుంచి తిడుతూ తీసుకురావడం, నిరంతరం పోలీస్ స్టేషన్ చుట్టూ తిప్పుతూ మానసికంగా కుంగదీయడంతో మధు ఆత్మరక్షణలో పడిపోయారు. యాదగిరి గౌడ్ తన రాజకీయ పలుకుబడిని ఉపయోగించి పోలీసులతో కలిసి తనను వేధిస్తున్నారని మధు తన ఆఖరి లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. సూసైడ్ నోట్‌లో యాదగిరి గౌడ్ తోపాటు మరో ఇద్దరి పేర్లను ప్రస్తావించిన మధు, తన మరణానికి వారే పూర్తి బాధ్యులని స్పష్టం చేస్తూ తనువు చాలించారు. మధు ఆత్మహత్య విషయం తెలియగానే ఆయన బంధువులు, కాలనీవాసులు ఆగ్రహంతో ఊగిపోయారు. మృతుడి దేహంతో పద్మావతి కాలనీలోని యాదగిరి గౌడ్ ఇంటికి చేరుకున్న వందలాది మంది నిరసనకారులు అక్కడ బైఠాయించారు. ఈ క్రమంలో నిరసన హింసాత్మకంగా మారి యాదగిరి గౌడ్ ఇంటిపై దాడికి దిగారు. ఆగ్రహావేశంతో ఇంటి కిటికీ అద్దాలను ధ్వంసం చేయడంతో అక్కడ యుద్ధ వాతావరణం నెలకొంది. తమకు న్యాయం జరిగే వరకు కదిలేది లేదని మధు కుటుంబ సభ్యులు భీష్మించుకోవడంతో పరిస్థితి అదుపు తప్పింది. శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసులు భారీగా మోహరించాల్సి వచ్చింది. ప్రస్తుతం హయత్‌నగర్ పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఫోర్జరీ కేసులో వాస్తవాలు ఏవైనా, బెయిల్ వచ్చిన తర్వాత కూడా ఒక వ్యక్తిని ఆత్మహత్యకు ప్రేరేపించేలా వేధించడంపై ఉన్నతాధికారులు విచారణ జరుపుతున్నారు. కాలనీలోని 400 కుటుంబాలకు ప్రతినిధిగా ఉన్న మధు మృతి చెందడం ఆ కాలనీవాసులను దిగ్భ్రాంతికి గురిచేసింది. బాధ్యులైన యాదగిరి గౌడ్, ఆయన అనుచరులతోపాటు వేధింపులకు పాల్పడిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని మృతుడి బావమరిది డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తమ కుటుంబానికి న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.



# ద్రవిడ గడ్డపై గెలుపు ఎవరిది?



**విశాలభారతి, జాతీయం:**

తమిళనాడు రాజకీయ యవనికపై సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ద్విముఖ పోరుకు స్వస్తి పలుకుతూ ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికలు సరికొత్త అధ్యాయానికి తెరలేపుతున్నాయి. దేశ ఆర్థిక గమనంలో మహారాష్ట్ర తర్వాత రెండో అతిపెద్ద శక్తిగా విరాజిల్లుతున్న ఈ రాష్ట్ర భవిష్యత్తు ఇప్పుడు ఓటరు నాడిపై ఆధారపడి ఉంది. దశాబ్దాల తరబడి ద్రవిడ మున్నేట్ర కజగం , ఆలిండియా అన్నాద్రవిడ మున్నేట్ర కజగం కూటముల మధ్యే అధికారం దోబూచులాడగా, ఇప్పుడు తమిళగ వెట్రి కజగం రూపంలో మూడో ప్రత్యామ్నాయం దూసుకురావడం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. ఈ త్రిముఖ పోటీ వల్ల రాష్ట్రంలో రాజకీయ సుస్థిరతకు భంగం కలుగుతుందా లేదా అన్న భయాందోళనలు పారిశ్రామిక వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. సుమారు 234 నియోజకవర్గాల్లో నెలకొన్న ఈ ఉత్కంఠభరిత పోరు రాష్ట్ర ప్రగతి ప్రయాణాన్ని ఏ దిశగా నడిపిస్తుందోనన్న ఉత్కంఠ దేశవ్యాప్తంగా నెలకొంది. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి అద్దం పట్టేలా గత ఆర్థిక సంవత్సరంలో నమోదైన 11.19 శాతం వృద్ధి రేటును కాపాడుకోవాల్సిన గురుతర బాధ్యత రాబోయే ప్రభుత్వంపై ఉంది. తమిళనాడు తనదైన ప్రత్యేక పారిశ్రామిక విధానాలతో దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది. దేశ మొత్తం భూభాగంలో కేవలం 4 శాతం మాత్రమే కలిగి ఉండి, జనాభాలో 6 శాతం వాటా ఉన్నప్పటికీ, జీడీపీలో రెండో స్థానంలో నిలవడం ఆ రాష్ట్ర పటిష్టతకు నిదర్శనం. తయారీ రంగం, ఐటీ సేవలు, వాహన పరిశ్రమల హబ్‌గా ఉన్న చెన్నై చుట్టుపక్కల ప్రాంతాలు ప్రపంచ స్థాయి మదుపర్లను ఆకర్షిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో రాజకీయంగా ఏర్పడే ఏ చిన్న అస్థిరత అయినా సరే దశాబ్దాలుగా నిర్మించుకున్న ఈ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తుందనే హెచ్చరికలు పరిశీలకుల నుంచి వినిపిస్తున్నాయి. రాజకీయ సమీకరణాలను పరిశీలిస్తే, తమిళనాడు ఎన్నికల చరిత్రలో ఒక విచిత్రమైన ఆనవాయితీ కనిపిస్తోంది. ప్రతి ఐదేళ్లకు ఒకసారి ప్రభుత్వం మారడం ఇక్కడి ఓటరు తీర్పుగా ఉండేది. అయితే 2016లో దివంగత ముఖ్యమంత్రి జయలలిత ఈ ధోరణిని తిరగరాస్తూ వరుసగా రెండోసారి అన్నాడీఎంకేను అధికారంలోకి తెచ్చి రికార్డు సృష్టించారు. తదనంతర పరిణామాల్లో 2021లో డీఎంకే పగ్గాలు చేపట్టి తిరిగి పాత పద్ధతినే కొనసాగించింది. ఇప్పుడు అధికారపక్షం తన పీఠాన్ని కాపాడుకోవాలని చూస్తుంటే, ప్రతిపక్షం అధికారాన్ని దక్కించుకోవడానికి సర్వశక్తులు ఒడ్డుతోంది. ఈ ఇద్దరి మధ్యలో సినీ గ్లామర్, భారీ యువ కేడర్ ఉన్న దళపతి విజయ్ టీవీకే పార్టీ రంగ ప్రవేశం చేయడం అంచనాలను తలకిందులు చేస్తోంది. ఈసారి ఓటరు నాడిని పసిగట్టడం రాజకీయ విశ్లేషకులకు కూడా అసాధ్యంగా మారుతోంది. గతంలో డీఎంకే వర్సెస్ అన్నాడీఎంకే అన్నట్లుగా సాగిన పోరులో ఓట్లు చీలే అవకాశం తక్కువగా ఉండేది. కానీ ఇప్పుడు టీవీకే పార్టీ 234 స్థానాల్లో ఒంటరిగా అభ్యర్థులను నిలపడంతో ఓట్ల విభజన భారీగా జరిగే ఆస్కారం ఉంది. ఈ పరిస్థితి వల్ల మెజార్టీ మార్కు అయిన 118 స్థానాలను ఏ కూటమి కూడా చేరుకోలేకపోతే హంగ్ అసెంబ్లీ ఏర్పడటం ఖాయమని స్పష్టమవుతోంది. రాజకీయ అనిశ్చితి నెలకొన్న చోట దీర్ఘకాలిక విధాన నిర్ణయాలు తీసుకోవడం కష్టమవుతుందని, తద్వారా రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటాయని ఆర్థికవేత్తలు ఆందోళన చెందుతున్నారు. రాజకీయ క్రీడలో కింగ్, కింగ్ మేకర్ ఎవరవుతారనే దానిపైనే తమిళ తంబీల భవిష్యత్తు ఆధారపడి ఉంది. తమిళనాడు అక్షరాస్యత రేటు 80.33 శాతంగా ఉండటం వల్ల ఓటరు ఎంతో చైతన్యవంతంగా ఆలోచిస్తాడన్న పేరుంది. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిని కూడా సమానంగా కోరుకునే ఇక్కడి ప్రజలు, ఉచిత పథకాలకు మాత్రమే పరిమితం కాకుండా పారిశ్రామిక ఉపాధి అవకాశాలకు పెద్దపీట వేసే నాయకత్వాన్ని కోరుకుంటున్నారు. విద్య, ఆరోగ్య రంగాల్లో ఇప్పటికే కేరళకు దీటుగా రాణిస్తున్న ఈ రాష్ట్రం, రాబోయే ఐదేళ్లలో వన్ ట్రిలియన్ డాలర్ ఎకానమీగా ఎదగాలన్న లక్ష్యాన్ని పెట్టుకుంది. ఈ ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని చేరుకోవాలంటే రాష్ట్రంలో బలమైన, స్థిరమైన ప్రభుత్వం ఉండటం అనివార్యం. హంగ్ ఏర్పడితే సంకీర్ణ రాజకీయాల ఒత్తిడి వల్ల నిర్ణయాల్లో జాప్యం జరిగి ప్రగతి కుంటుపడే ప్రమాదం పొంచి ఉంది. పెట్టుబడిదారులు సాధారణంగా ఏ రాష్ట్రంలోనైతే రాజకీయ సుస్థిరత ఉంటుందో అక్కడికే మొగ్గు చూపుతుంటారు. ప్రస్తుత త్రిముఖ పోరు వల్ల తమిళనాడులో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని వాతావరణం నెలకొందని ఇన్వెస్టర్లు భావిస్తున్నారు. కింగ్ మేకర్లుగా అవతరించే పార్టీలు తమ సొంత ఎజెండాలను ముందుకు తెస్తే, పారిశ్రామిక అనుమతులు, రాయితీల విషయంలో గందరగోళం తలెత్తే అవకాశం ఉంది. ఇప్పటికే అనేక మల్టీ నేషనల్ కంపెనీలు తమిళనాడులో తమ కార్యకలాపాలను విస్తరిస్తున్న తరుణంలో, ప్రభుత్వాల మార్పు వల్ల విధానాల్లో మార్పులు వస్తే అవి పొరుగు రాష్ట్రాలకు తరలిపోయే ముప్పు కూడా లేకపోలేదు. ఈ భయాలే ఇప్పుడు మేధావి వర్గాన్ని వెంటాడుతున్నాయి. గురువారం జరగబోయే పోలింగ్‌లో సుమారు 6.23 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో యువత శాతం ఎక్కువగా ఉండటం విజయ్ వంటి నూతన నాయకులకు కలిసి వచ్చే అంశంగా కనిపిస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో ఉన్న పటిష్టమైన యంత్రాంగం డీఎంకే, అన్నాడీఎంకే కూటములకు అతిపెద్ద బలం. సంప్రదాయ ఓటు బ్యాంకు ఈ ద్రవిడ దిగ్గజాల మధ్యే చీలిపోయినా, తటస్థ ఓటర్లు ఎటు మొగ్గుతారనేదే ఫలితాలను శాసించనుంది. మే 4వ తేదీన వెలువడనున్న ఫలితాలు కేవలం ఒక ముఖ్యమంత్రిని మాత్రమే కాకుండా, దక్షిణ భారత ఆర్థిక శక్తి భవిష్యత్ దిశను కూడా నిర్ణయిస్తాయి. రాష్ట్రం పారిశ్రామికంగా సాధించిన 15 శాతం తయారీ రంగ వాటా దేశంలోనే అత్యధికం. టెక్స్‌టైల్స్, లెదర్ పరిశ్రమల్లో తమిళనాడుకు ఎదురులేని స్థానం ఉంది. రాష్ట్రంలోని 38 జిల్లాల్లో ఒక్కో జిల్లాకు ఒక్కో ప్రత్యేకత ఉంది. ఉదాహరణకు కోయంబత్తూర్ ఇంజనీరింగ్ రంగానికి, తిరుపూర్ వస్త్ర రంగానికి పేరుగాంచాయి. ఈ వ్యవస్థలన్నీ సజావుగా సాగాలంటే పరిపాలనలో నిరంతరాయమైన పారదర్శకత అవసరం. రాజకీయ వర్గాల మధ్య ఉన్న వైరుధ్యాలు పరిపాలనా యంత్రాంగంపై పడితే సామాన్యుడికి అందే సేవల్లో జాప్యం జరుగుతుంది. అందుకే ఓటరు విజ్ఞతతో సుస్థిర ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని కోరుకుంటున్నారు. ప్రస్తుత ఎన్నికల ప్రచారంలో ప్రధాన పార్టీలన్నీ పారిశ్రామికాభివృద్ధి పైనే ఫోకస్ పెట్టాయి. లక్షలాది మంది యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇస్తున్నాయి. అయితే క్షేత్రస్థాయిలో హంగ్ అసెంబ్లీ సూచనలు కనిపిస్తుండటంతో రాజకీయ చదరంగం ఎటు తిరుగుతుందో ఎవరికీ పాలుపోవడం లేదు. గతంలో ఇలాంటి సందర్భాలు తమిళనాడులో అరుదుగా వచ్చినప్పటికీ, ప్రస్తుత పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. అన్నాడీఎంకేలో అంతర్గత కుమ్ములాటలు ఒకవైపు, డీఎంకేపై వ్యతిరేకత మరోవైపు ఉండటంతో టీవీకే పార్టీ ఒక కీలక శక్తిగా ఎదిగి ఫలితాలను తలకిందులు చేసేలా కనిపిస్తోంది. హంగ్ అసెంబ్లీ ఏర్పడితే తమిళనాడు రాజకీయ చరిత్రలో అస్థిరతకు పునాది పడినట్లే అవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

శే ప్రగతిలో తమిళనాడు పాత్రను తక్కువ అంచనా వేయలేం. ఈ రాష్ట్రం నుంచి వసూలయ్యే పన్నుల ఆదాయం కేంద్రానికి ఎంతో కీలకం. దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణతో పోటీ పడుతూ అభివృద్ధి పథంలో సాగుతున్న ఈ రాష్ట్రం, రాబోయే రోజుల్లో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాలంటే ఈ ఎన్నికలు చాలా కీలకం. ఎన్నికల సంఘం చేపట్టిన కట్టుదిట్టమైన చర్యల వల్ల పోలింగ్ శాతం పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. ఓటింగ్ శాతం పెరిగితే అది ఏ పార్టీకి లాభిస్తుందనే లెక్కల్లో నేతలు నిమగ్నమయ్యారు. ఫలితాల అనంతరం ఏర్పడే ప్రభుత్వం ఇన్వెస్టర్ల నమ్మకాన్ని నిలబెట్టుకోవడంలో ఎంతవరకు సఫలమవుతుందనేది చూడాలి. అంతిమంగా తమిళనాడు ఓటరు చారిత్రక బాధ్యతను మోస్తున్నాడు. ఏకపక్ష మెజార్టీ ఇచ్చి రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నిలుపుతారా లేక హంగ్ అసెంబ్లీ ద్వారా రాజకీయ అనిశ్చితికి దారితీస్తారా అన్నది కేవలం మరికొన్ని రోజుల్లో తేలిపోనుంది. తమిళ సంస్కృతి, ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటూనే ఆర్థికాభివృద్ధిని సమతుల్యం చేసే నాయకత్వం కోసం రాష్ట్రం ఎదురుచూస్తోంది. మే 4వ తేదీన వెలువడే తీర్పు తమిళనాడు భవిష్యత్తును మాత్రమే కాకుండా, దేశ ఆర్థిక వృద్ధి ఇంజిన్‌కు ఇంధనాన్ని ఇచ్చే దిశగా ఉండాలని అందరూ ఆకాంక్షిస్తున్నారు. పారిశ్రామికంగా, ఆర్థికంగా తమిళనాడు సాధించిన ఘనతలు ఇలాగే కొనసాగాలంటే సుస్థిర పరిపాలన ఒక్కటే మార్గం.

# గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్‌గా హైదరాబాద్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ వేదికగా పారిశ్రామికాభివృద్ధిని పరుగులు పెట్టించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేగవంతం చేసింది. స్విట్జర్లాండ్‌లోని దావోస్ పర్యటనతో పాటు ఇటీవల నిర్వహించిన రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా అవి త్వరితగతిన కార్యరూపం దాల్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన సుదీర్ఘ సమీక్షలో ఆయన ఈ ప్రాజెక్టుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు. పారిశ్రామిక వేత్తలు రాష్ట్రంపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వారికి అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి జాప్యం జరగకూడదని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే క్రమంలో లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించడం ఒక ఎత్తయితే వాటిని క్షేత్రస్థాయిలో స్థాపించేలా చూడటం మరో ఎత్తు అని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. సదస్సుల్లో సుమారు 2.10 లక్షల కోట్ల రూపాయల విలువైన ప్రతిపాదనలు వచ్చాయని అధికారులు నివేదించారు. ఈ భారీ పెట్టుబడులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలని సూచించారు. భూ కేటాయింపుల్లో ఎదురయ్యే సాంకేతిక ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ పారిశ్రామిక వేత్తలకు అండగా నిలవాలని నిర్దేశించారు. కేటాయించిన భూముల్లో పనులు ప్రారంభించేందుకు అవసరమైన అన్ని అనుమతులను ఏకగవాక్ష పద్ధతిలో వేగంగా మంజూరు చేయాలని కోరారు. ముఖ్యంగా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఐటీ, ఫార్మా, మ్యానుఫ్యాక్చరింగ్ రంగాలకు చెందిన ప్రముఖ సంస్థలకు మొదటి కేటగిరీలో ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఒప్పందాలు చేసుకున్న సంస్థలను మూడు విభాగాలుగా వర్గీకరించి పర్యవేక్షించాలని సూచించారు. మొదటి కేటగిరీలో ఉన్న ప్రతిష్టాత్మక సంస్థల ప్రతినిధులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ వారి అవసరాలను తీర్చాలని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటికే కార్యకలాపాలు సాగిస్తున్న సంస్థలు తమ ఉత్పాదకతను పెంచుకునేందుకు ఆసక్తి చూపుతుంటే వారికి కూడా తగిన ప్రోత్సాహకాలు అందించాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియ ద్వారా స్థానిక యువతకు సుమారు 1.25 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా వేశారు. హైదరాబాద్ శివార్లలో ప్రతిపాదించిన ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నగరంలో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు కల్పించేలా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. డేటా సెంటర్లు, ఏఐ ఆధారిత సంస్థలు తమ కేంద్రాలను ఇక్కడ ఏర్పాటు చేసేందుకు మొగ్గు చూపుతున్న నేపథ్యంలో వారికి అవసరమైన విద్యుత్, నీటి వసతిపై ముందస్తు ప్రణాళికలు ఉండాలని చెప్పారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని నగర విస్తరణకు అనుగుణంగా రవాణా సౌకర్యాలను మెరుగుపరచాలని సూచించారు. ఫ్యూచర్ సిటీ తెలంగాణ ప్రగతికి తలమానికంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. పర్యావరణ హితమైన అభివృద్ధికి పెద్దపీట వేయాలని అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. డేటా సెంటర్ల నిర్వహణకు భారీగా నీటి అవసరం ఉంటుందని గుర్తించిన ఆయన వినూత్న ప్రతిపాదన చేశారు. మురుగునీటి శుద్ధి కేంద్రాల ద్వారా శుద్ధి చేసిన నీటిని ఈ డేటా సెంటర్లకు సరఫరా చేసేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. దీనివల్ల తాగునీటిపై ఒత్తిడి తగ్గడంతో పాటు వ్యర్థ జలాల పునర్వినియోగం సాధ్యమవుతుందని వివరించారు. పారిశ్రామిక అవసరాలకు ఎస్టీపీ నీటిని వాడటం వల్ల ఖర్చు కూడా తగ్గుతుందని నిపుణులు చెబుతున్న గణాంకాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. పెట్టుబడుల రాకతో రాష్ట్ర జీఎస్డీపీ గణనీయంగా వృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. గత కొన్ని నెలల్లోనే సుమారు 45 శాతం ఎంవోయూలు ప్రాథమిక అనుమతుల దశకు చేరుకోవడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన ఒప్పందాలను కూడా వేగవంతం చేసేందుకు సంబంధిత శాఖల మధ్య సమన్వయం ఉండాలని కోరారు. పారిశ్రామిక క్లస్టర్ల ఏర్పాటు ద్వారా అభివృద్ధిని వికేంద్రీకరించాలని ప్రభుత్వ ఉద్దేశమని వెల్లడించారు. కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా ద్వితీయ శ్రేణి నగరాలకు కూడా పరిశ్రమలను విస్తరించడం ద్వారా ప్రాంతీయ అసమానతలను తొలగించవచ్చని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం కేటాయించిన భూముల్లో నిర్ణీత గడువులోగా పనులు ప్రారంభించని సంస్థలపై కఠినంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నిరుపయోగంగా ఉన్న పారిశ్రామిక భూముల వివరాలను సేకరించి వాటిని కొత్తగా వచ్చే సంస్థలకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భూములను కేవలం రియల్ ఎస్టేట్ లాభాల కోసం వాడుకునే ప్రయత్నాలను అడ్డుకోవాలని స్పష్టం చేశారు. వాస్తవంగా పరిశ్రమలు స్థాపించి ఉద్యోగ అవకాశాలు కల్పించే వారికే ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరిస్తుందని హామీ ఇచ్చారు. పారదర్శకమైన విధానాల ద్వారానే పెట్టుబడిదారుల్లో నమ్మకం పెరుగుతుందని నొక్కి చెప్పారు. అంతర్జాతీయ సంస్థల ప్రతినిధుల కోసం రాష్ట్రంలో అత్యాధునిక వసతులతో కూడిన బిజినెస్ హబ్‌లను ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. విదేశీ పెట్టుబడిదారులు ఇక్కడ పర్యటించినప్పుడు వారికి మెరుగైన ఆతిథ్యంతో పాటు ప్రాజెక్టులకు సంబంధించిన పూర్తి సమాచారం ఒకే చోట లభించేలా చూడాలని చెప్పారు. రాష్ట్రంలో ఉన్న మానవ వనరుల నైపుణ్యాన్ని పెంచేందుకు స్కిల్ యూనివర్సిటీలను పారిశ్రామిక అవసరాలకు అనుసంధానించాలని సూచించారు. దీనివల్ల పరిశ్రమలకు కావాల్సిన నిపుణులైన కార్మికులు ఇక్కడే లభిస్తారని తెలిపారు. ఈ చర్యల ద్వారా తెలంగాణ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్‌గా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సమీక్షలో ఫార్మా సిటీ ప్రత్యామ్నాయ ప్రణాళికలపై కూడా చర్చ జరిగింది. పర్యావరణానికి ముప్పు కలగకుండా క్లస్టర్ల రూపంలో ఫార్మా పరిశ్రమలను ప్రోత్సహించాలని నిర్ణయించారు. ఒక్కో క్లస్టర్‌లో కనీసం 50 నుంచి 100 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఫార్మా రంగానికి అవసరమైన లాజిస్టిక్స్ సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా ఎగుమతులను పెంచే అవకాశం ఉందని గణాంకాలతో వివరించారు. ఇప్పటికే ఈ రంగం ద్వారా రాష్ట్రానికి 15 శాతం ఆదాయం లభిస్తోందని భవిష్యత్తులో దీనిని 25 శాతానికి చేర్చడమే లక్ష్యమని చెప్పారు.



# కాళేశ్వరం విషయంలో రేవంత్ ఫెయిల్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి వ్యవహారం మరోసారి ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ప్రాజెక్టుపై విచారణ జరుపుతున్న తీరును, రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో తూర్పారబట్టారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో అట్టర్‌ఫ్లాప్ అయిందని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై న్యాయస్థానం చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని ఆయన ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలోని పెద్దలను కాపాడటానికే రేవంత్ సర్కార్ ప్రయత్నిస్తోందని, అందుకే విచారణ ప్రక్రియలో తీవ్రమైన లోపాలు కనిపిస్తున్నాయని ఆయన ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన భారీ అక్రమాలపై విచారణ కోసం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక అంశంపై హైకోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి పెద్ద ఎదురుదెబ్బ అని కిషన్ రెడ్డి అభివర్ణించారు. న్యాయస్థానం తప్పుబట్టేలా రిపోర్టును సిద్ధం చేయించడం వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీని, ఆ పార్టీ అధినేత కేసీఆర్‌ను రక్షించే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా బలహీనమైన వాదనలను వినిపించిందని విమర్శించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, అనుసరించిన వ్యూహాలు కేవలం కాలయాపన కోసమే తప్ప, దోషులను శిక్షించేందుకు కాదని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే నేడు న్యాయస్థానంలో చుక్కెదురైందని, ఇది పరిపాలనాపరమైన వైఫల్యమని కిషన్ రెడ్డి విశ్లేషించారు. వేల కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అయినట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నప్పటికీ, వాటిని చట్టపరంగా కోర్టు ముందు ప్రవేశపెట్టడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని ఆయన మండిపడ్డారు. ఎన్నికలకు ముందు భారీ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చాక మాత్రం మాట తప్పుతోందని విమర్శించారు. ప్రజల కళ్లకు గంతలు కట్టేందుకు విచారణల పేరుతో నాటకాలు ఆడుతున్నారని, వాస్తవానికి అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. ఎన్నికల ప్రచార సమయంలో రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ అగ్రనేతలు కాళేశ్వరం అవినీతిపై పెద్ద ఎత్తున గర్జించిన విషయాన్ని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు, నాటి మంత్రులు, ఎమ్మెల్యేలపై కఠిన చర్యలు తీసుకుంటామని, జైలుకు పంపుతామని హామీలు ఇచ్చారని ఆయన చెప్పారు. కానీ నేడు అధికార పీఠం ఎక్కిన తర్వాత ఆ వేగం ఎందుకు తగ్గిందని ఆయన ప్రశ్నించారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించకుండా, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం పాత ప్రభుత్వ అవినీతిని కప్పిపుచ్చే ప్రయత్నం చేయడం తెలంగాణ ప్రజలను వంచించడమే అవుతుందని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా ఏ ఒక్క పెద్ద అవినీతి కేసులోనూ పురోగతి లేకపోవడం విచారకరమని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ఒక్కటే కాదు, తెలంగాణలో గత పదేళ్లలో జరిగిన అనేక అక్రమాలపై రేవంత్ రెడ్డి గతంలో గొంతు ఎత్తారని ఆయన గుర్తు చేశారు. లక్షల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని సీఎం స్వయంగా ప్రకటించినా, ఆ సొమ్మును తిరిగి రాబట్టే విషయంలో ఎందుకు వెనకడుగు వేస్తున్నారని నిలదీశారు. కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్న ఈ ప్రభుత్వం, క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టడంలో మాత్రం చేతులెత్తేసిందని ఆయన విమర్శించారు. ఫార్ములా వన్ రేస్ ఖర్చులు, డ్రగ్స్ కేసులు, భూ ఆక్రమణలు వంటి కీలక అంశాల్లో విచారణ ఎక్కడ ఆగిపోయిందని కిషన్ రెడ్డి నిలదీశారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాలలో జరిగిన అవకతవకలపై కూడా కాంగ్రెస్ పార్టీ గతంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. కానీ ఇప్పుడు ఆ ఫైళ్లన్నీ ఎక్కడ దాచారని ప్రశ్నించారు. భూ కేటాయింపుల్లో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపిస్తామని చెప్పిన మాటలు ఏమయ్యాయని ఆయన అడిగారు. ఇవన్నీ చూస్తుంటే ప్రభుత్వం కేవలం కాలక్షేపం చేస్తోందని అర్థమవుతోందని ఆయన విశ్లేషించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య ఉన్న అంతర్గత అవగాహనే ఈ జాప్యానికి కారణమని కిషన్ రెడ్డి సంచలన ఆరోపణ చేశారు. వెలుపల ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నట్లు కనిపించినా, లోపల మాత్రం రెండు పార్టీలు ఒక్కటేనని ఆయన వాదించారు. కేసీఆర్ కుటుంబంపై చర్యలు తీసుకోకపోవడం వెనుక పెద్ద ఎత్తున ఒప్పందాలు జరిగాయని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ప్రజలను మోసం చేసేందుకు ఈ రెండు పార్టీలు 'దూప్ ఫైటింగ్' చేస్తున్నాయని, నాటకీయంగా పోరాడుతున్నట్లు నటిస్తూ ఒకరినొకరు కాపాడుకుంటున్నారని ఆయన దుయ్యబట్టారు. తెలంగాణ ప్రజలు ఒక మార్పు వస్తుందని, అక్రమార్కుల ఆట కట్టిస్తారని నమ్మి కాంగ్రెస్ పార్టీకి అధికారాన్ని కట్టబెట్టారని కిషన్ రెడ్డి అన్నారు. కానీ ఆ ఆశలన్నీ అడియాశలయ్యాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.



# రోడ్డున పడ్డ సామాన్యుడి ప్రయాణం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాష్ట్ర రవాణా వ్యవస్థకు వెన్నెముక వంటి ఆర్టీసీ మరోసారి నిప్పుల కొలిమిలా మారింది. గత కొన్నేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు, నెరవేరని హామీలు వెరసి కార్మికులను రోడ్డున పడేలా చేశాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు నిరవధిక సమ్మె బాట పట్టడంతో ప్రజా రవాణా పూర్తిగా స్తంభించిపోయింది. గ్రామీణ ప్రాంతాల నుంచి నగరాల వరకు బస్సులు డిపోలకే పరిమితం కావడంతో సామాన్య ప్రయాణికులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. అటు ప్రభుత్వం, ఇటు కార్మిక సంఘాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభన రాష్ట్రంలో ఒక అనిశ్చిత వాతావరణాన్ని సృష్టించింది. కేవలం గడియారం ముల్లు 12 గంటలు దాటగానే వేలాది మంది కార్మికులు డిపోల ముందు బైఠాయించి తమ నిరసన గళాన్ని వినిపించారు. సమ్మె నిర్ణయంపై ఆర్టీసీ జేఏసీ అధ్యక్షుడు వెంకన్న మీడియా ముఖంగా ప్రభుత్వ తీరును ఎండగట్టారు. తాము అడుగుతున్నవి గొంతెమ్మ కోరికలు కావని, గతంలో ప్రభుత్వం అంగీకరించిన అంశాలనే అమలు చేయాలని కోరుతున్నామని స్పష్టం చేశారు. మంగళవారం సాయంత్రం ప్రభుత్వం అత్యవసరంగా జరిపిన చర్చలు కేవలం కంటితుడుపు చర్యగానే మిగిలాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 42 రోజుల ముందే సమ్మె నోటీసు ఇచ్చినప్పటికీ, ప్రభుత్వం కాలయాపన చేసిందని ఆయన ఆరోపించారు. చర్చల పేరిట పిలిచి, మళ్లీ నెల రోజుల సమయం అడగడం వెనుక చిత్తశుద్ధి లోపించిందని కార్మిక నేతలు భావిస్తున్నారు. ఈ పరిణామాలు కార్మికులను తీవ్ర నిరాశకు గురిచేయడంతోనే విధిలేక సమ్మెకు దిగాల్సి వచ్చిందని వారు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 97 డిపోలలో సుమారు 45,000 మందికి పైగా కార్మికులు ఈ సమ్మెలో ప్రత్యక్షంగా పాల్గొంటున్నారు. దీనివల్ల ప్రతిరోజూ దాదాపు 9,000 బస్సులు రోడ్డుపైకి రాకుండా ఆగిపోయాయి. సాధారణంగా ప్రతిరోజూ ఆర్టీసీ ద్వారా సుమారు 80 లక్షల మంది ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకుంటారు. సమ్మె కారణంగా వీరంతా ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది.




ఆటోలు, ప్రైవేట్ టాక్సీల యజమానులు ఇదే అదనుగా భావించి మూడు రెట్లు అధిక ధరలు వసూలు చేస్తుండటంతో సామాన్యుడి జేబుకు చిల్లు పడుతోంది. పండుగలు, శుభకార్యాల సీజన్ కావడంతో ప్రయాణికుల ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి.చరిత్రను ఒకసారి తరచి చూస్తే, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత పొరుగు రాష్ట్రం ఏపీలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ఏపీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి అప్పుడే ఏడు ఏళ్లు గడిచిపోయింది. అక్కడ కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు పొంది సకాలంలో వేతనాలు అందుకుంటున్నారు. కానీ తెలంగాణలో మాత్రం విలీన ప్రక్రియ దశాబ్ద కాలంగా ఒక కలగానే మిగిలిపోయింది. గత పదేళ్ల కేసీఆర్ పాలనలో కార్మికులు తమ ఆవేదనను వినిపించినా, అప్పటి ప్రభుత్వం కఠినంగా వ్యవహరించింది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రసక్తే లేదని, అవసరమైతే సంస్థను మూసివేస్తామని అప్పటి ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు కార్మికుల మనోభావాలను దెబ్బతీశాయి. గతంలో జరిగిన సమ్మె సందర్భంగా సుమారు 40 మంది కార్మికులు మానసిక ఒత్తిడితో, ఆర్థిక ఇబ్బందులతో ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరం. అయినప్పటికీ నాటి ప్రభుత్వం తన పంతాన్ని వీడలేదు. కార్మికుల పట్ల ప్రదర్శించిన ఆ కఠిన వైఖరి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతకు దారితీసింది. పాలకుల నిరంకుశత్వానికి ఆ సమ్మె ఒక ఉదాహరణగా నిలిచింది. ఆ సమయంలో ప్రతిపక్ష నేతగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు ఇతర కాంగ్రెస్ నాయకులు కార్మికుల వద్దకు వెళ్లి సంఘీభావం తెలిపారు. వారి డిమాండ్లు న్యాయమైనవని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని బహిరంగంగా హామీ ఇచ్చారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కాగానే తమ సమస్యలు పరిష్కారమవుతాయని కార్మికులు ఆశగా ఎదురుచూశారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత వేతన సవరణ, పెండింగ్‌లో ఉన్న బకాయిలు, విలీన ప్రక్రియ వేగవంతం అవుతాయని భావించారు. కానీ అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా ఆశించిన స్థాయిలో పురోగతి లేకపోవడంతో కార్మికుల్లో అసహనం పెరిగింది.

# ఆర్టీసీ సమ్మె వెనుక హరీశ్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాష్ట్రంలో ఒక్కసారిగా వేడెక్కిన ఆర్టీసీ సమ్మె రాజకీయం ఇప్పుడు అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. ఆర్టీసీ కార్మికులు చేపట్టిన ఈ ఆందోళన వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయని, ముఖ్యంగా బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్ రావు హస్తం ఉందంటూ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయి. ప్రభుత్వంతో చర్చలు జరుగుతున్న కీలక సమయంలో జేఏసీ నేతలు ప్రవర్తించిన తీరుపై మంత్రి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అధికారులతో చర్చలు జరుపుతున్న నేతలు, మధ్యలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్ రాగానే హఠాత్తుగా బయటకు వెళ్లిపోవడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఈ పరిణామాలన్నీ చూస్తుంటే సమ్మెను కావాలనే ఎవరో వెనుక నుండి నడిపిస్తున్నట్లు స్పష్టమవుతోందని మంత్రి ఆరోపించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉప ముఖ్యమంత్రి మరియు ఆర్థిక మంత్రి రాష్ట్రంలో అందుబాటులో లేరని, వారు తిరిగి రాగానే కార్మికుల హామీలపై పూర్తిస్థాయి స్పష్టత ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని పొన్నం ప్రభాకర్ గుర్తుచేశారు. అప్పటివరకు ఓపిక పట్టి సమ్మెను విరమించాలని కోరినప్పటికీ, జేఏసీ నేతలు పట్టించుకోకుండా మొండిగా ముందుకు వెళ్లడం వెనుక రాజకీయ ప్రేరేపిత కారణాలు ఉన్నాయని ఆయన విమర్శించారు. ముఖ్యంగా హరీశ్ రావు ఈ సమ్మెపై స్పందించిన తీరు, ఆయన మాట్లాడిన మాటలు గమనిస్తే ఈ ఆందోళనల వెనుక వారి ప్రమేయం ఉందన్న అనుమానాలు బలపడుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. గత పదేళ్ల పాలనలో ఆర్టీసీని గాలికి వదిలేసిన వారు, ఇప్పుడు కార్మికుల పక్షపాతిగా నటిస్తూ రాజకీయం చేయడం హాస్యాస్పదంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఆర్టీసీ సమ్మెను ఎంత దారుణంగా అణిచివేసిందో కార్మికులు మరచిపోలేదని మంత్రి గుర్తుచేశారు. ఆనాడు కార్మికుల ప్రాణాలతో ఆడుకుని, వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన నేతలు ఇప్పుడు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అప్పట్లో గుర్తింపు సంఘాల ఎన్నికలను



నిర్వహించకుండా, కార్మికుల కనీస హక్కులను కాలరాసిన చరిత్ర గత ప్రభుత్వానిదని ఆయన మండిపడ్డారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల డిమాండ్ల పట్ల అత్యంత సానుకూల దృక్పథంతో ఉందని, వారి సమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తోందని ఆయన పునరుద్ఘాటించారు. కార్మికులు ప్రతిపక్షాల ట్రాప్‌లో పడకుండా ప్రభుత్వానికి సహకరించాలని ఆయన కోరారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ కార్మికుల సంక్షేమం కోసం అనేక విప్లవాత్మక చర్యలు తీసుకుందని మంత్రి వివరించారు. కార్మికుల చిరకాల వాంఛ అయిన డిమాండ్లను పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. జేఏసీ నేతలు ముందుంచిన ముప్పై రెండు ప్రధాన అంశాల్లో పీఆర్సీ, యూనియన్ల పునరుద్ధరణ మరియు విలీనం మినహా మిగిలిన ఇరవై తొమ్మిది డిమాండ్లకు ప్రభుత్వం ఇప్పటికే అంగీకారం తెలిపిందని ఆయన వెల్లడించారు. ప్రభుత్వం ఇంత సానుకూలంగా స్పందించినప్పటికీ, సమ్మె బాట పట్టడం వెనుక గూఢార్థం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కార్మికుల ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమన్నట్లుగా కొందరు నేతలు వ్యవహరించడం శోచనీయమని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలి ఉన్న అతి ముఖ్యమైన విలీనం అంశంపై కూడా ప్రభుత్వం వెనక్కి తగ్గలేదని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. విలీన ప్రక్రియలో కొన్ని సాంకేతిక పరమైన ఇబ్బందులు ఉన్నాయని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించడానికి గరిష్టంగా నాలుగు వారాల సమయం పడుతుందని అధికారుల బృందం తెలిపిందని ఆయన చెప్పారు. నెల రోజుల్లోనే సమస్యను కొలిక్కి తెస్తామని భరోసా ఇచ్చినప్పటికీ, కనీసం ఆ సమయం కూడా ఇవ్వకుండా సమ్మెకు వెళ్లడం వెనుక కుట్ర కోణం స్పష్టంగా కనిపిస్తోందని ఆయన విమర్శించారు. రాష్ట్ర రవాణా వ్యవస్థను స్తంభింపజేయడం ద్వారా ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావాలనేది ప్రతిపక్షాల అసలు వ్యూహమని ఆయన ఘాటుగా స్పందించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ప్రజల్లోకి బలంగా వెళ్లిందని, మహిళలు ఉచిత బస్సు ప్రయాణం పట్ల ఎంతో సంతోషంగా ఉన్నారని మంత్రి పేర్కొన్నారు. ఈ పథకం విజయవంతం కావడం సహించలేని ప్రతిపక్షాలు, కుట్రపూరిత రాజకీయాలకు తెరలేపాయని ఆయన ధ్వజమెత్తారు. మహాలక్ష్మి పథకాన్ని దెబ్బతీయడం ద్వారా ప్రజలను ఇబ్బందుల్లోకి నెట్టాలని వారు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులను తప్పుదోవ పట్టించి, వారిని పావులుగా వాడుకుంటున్నారని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రజల ఆదరణ చూసి ఓర్వలేకనే ఆర్టీసీపై ఇలాంటి దాడులకు దిగుతున్నారని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పేద ప్రజలకు ప్రధాన రవాణా ఆధారంగా ఉన్న ఆర్టీసీని 'లైఫ్ లైన్' గా మంత్రి అభివర్ణించారు. సామాన్యుల ప్రయాణాలకు వెన్నెముకగా నిలిచే సంస్థను రాజకీయ కారణాలతో దెబ్బతీయవద్దని ఆయన కార్మికులకు విజ్ఞప్తి చేశారు. సమ్మె వల్ల సామాన్య ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకోవాలని, ప్రజలకు అసౌకర్యం కలిగించడం ఎవరికీ మంచిది కాదని ఆయన సూచించారు. ప్రభుత్వం చర్చలకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని, ప్రజాస్వామ్య పద్ధతిలో సమస్యలను పరిష్కరించుకోవాలే తప్ప ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం కార్మికుల పక్షమేనని, ఏ ఒక్క కార్మికుడికీ అన్యాయం జరగనివ్వబోమని ఆయన భరోసా ఇచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అడుగులు వేస్తోందని, కార్మికులు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం ఇస్తున్న హామీలను నమ్మి, సమ్మె విరమించి విధుల్లో చేరాలని ఆయన కోరారు. కార్మికుల డిమాండ్ల సాధన కోసం ప్రభుత్వం ఒక కాలపరిమితిని నిర్దేశించుకుందని, ఆ గడువులోగా అన్ని సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అనాలోచిత నిర్ణయాలతో సంస్థను నష్టాల్లోకి నెట్టవద్దని, ఇది అందరి సంస్థ అని భావించి కాపాడుకోవాలని హితవు పలికారు. ప్రతిపక్షాల రెచ్చగొట్టే మాటలు నమ్మి భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని ఆయన కార్మికులను హెచ్చరించారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలను విశ్లేషిస్తే, ఆర్టీసీ సమ్మె చుట్టూ జరుగుతున్న పరిణామాలు అధికార కాంగ్రెస్ మరియు ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య తీవ్రస్థాయి ఘర్షణకు దారితీస్తున్నాయి. మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన ఆరోపణలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వం వైపు నుంచి సానుకూల స్పందన ఉన్నప్పటికీ సమ్మె కొనసాగడం వెనుక ఉన్న బలమైన శక్తులపై విచారణ జరగాలని అధికార పార్టీ నేతలు కోరుతున్నారు. ప్రజల ప్రయోజనాలే పరమావధిగా ప్రభుత్వం పనిచేస్తుందని, ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గబోమని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. ఈ సమ్మె పరిణామాలు రానున్న రోజుల్లో మరెన్ని మలుపులు తిరుగుతాయో వేచి చూడాలి. కార్మికుల ఆందోళనలను పరిష్కరించడంలో ప్రభుత్వం చూపిస్తున్న చొరవను కొందరు స్వాగతిస్తున్నా, క్షేత్రస్థాయిలో ఉన్న అపనమ్మకాన్ని తొలగించడంలో మరింత కృషి జరగాల్సి ఉందనేది వాస్తవం. మంత్రి పొన్నం ప్రభాకర్ పదేపదే చెబుతున్నట్లుగా, సాంకేతిక అంశాల పరిష్కారానికి కార్మికులు సమయం ఇవ్వాలని కోరుతున్నారు. అటు కార్మికులు మాత్రం తమ డిమాండ్ల విషయంలో తక్షణ నిర్ణయాలు కావాలని పట్టుబడుతున్నారు. ఈ ప్రతిష్టంభన సామాన్య ప్రయాణికులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ క్రమంలోనే మంత్రి, ప్రతిపక్ష నేతలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం కార్మికులను వాడుకుంటున్నారన్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని ఘాటుగా స్పందించారు.

# మంత్రి ఉత్తమ్ చేతులెత్తేశారా!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నిర్మాణంలో జరిగిన భారీ అక్రమాలు, సాంకేతిక లోపాలపై తెలంగాణ విజిలెన్స్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఇప్పుడు సచివాలయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రజాధనం వేల కోట్ల రూపాయలు వృథా కావడానికి కారణమైన 57 మంది ఇంజినీరింగ్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిషన్ ఏడాది కిందటే సిఫారసు చేసినప్పటికీ, నేటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉలుకూ పలుకూ లేకపోవడం గమనార్హం. పదవీ విరమణ చేసిన వారితో పాటు ప్రస్తుతం విధుల్లో ఉన్న అధికారులపై కూడా చర్యలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విజిలెన్స్ నివేదికను నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తొక్కి పెట్టారా అన్న అనుమానాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడం వెనుక పెద్ద ఎత్తున పైరవీలు సాగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతేడాది మార్చి నెలలోనే విజిలెన్స్ కమిషన్ తన సుదీర్ఘ విచారణను పూర్తి చేసి నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. అయితే ఆ నివేదికను నాలుగు నెలల పాటు గుట్టుగా ఉంచిన నీటి పారుదల శాఖ, జూన్ నెలలో అరకొరగా వివరాలను బహిర్గతం చేసింది. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో కనీస అనుభవం లేని అధికారులను కీలక పోస్టుల్లో నియమించడం వల్లనే మేడిగడ్డ బారాజ్ కుంగిపోయే పరిస్థితి వచ్చిందని కమిషన్ కుండబద్దలు కొట్టింది. నిర్మాణ సంస్థలు ఇచ్చిన మ్యాపులు, ప్లాన్లను కనీసం పరిశీలించకుండానే అధికారులు సంతకాలు పెట్టేయడం వల్లనే ఇంతటి ఘోరం జరిగిందని విచారణలో తేలింది. ఈ నిర్లక్ష్యం వల్ల రాష్ట్ర ఖజానాకు వేల కోట్ల నష్టం వాటిల్లిందని, అందుకే బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కమిషన్ గట్టిగా సూచించింది. కేవలం క్రమశిక్షణా చర్యలతో సరిపెట్టకుండా, ఈ అక్రమాల్లో భాగస్వాములైన 33 మంది ఇంజినీర్లకు భారీగా జరిమానా విధించాలని కూడా కమిషన్ స్పష్టం చేసింది. సాధారణంగా ప్రభుత్వ అధికారులు ఇలాంటి కేసుల్లో కోర్టు మెట్లు ఎక్కి స్టే తెచ్చుకుంటారని భావించిన కమిషన్, గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను సైతం నివేదికలో పొందుపరిచింది. పోలీసు విచారణ, శాఖాపరమైన చర్యలు ఏకకాలంలో చేపట్టడానికి ఎలాంటి చట్టపరమైన అడ్డంకులు లేవని గుర్తు చేసినా, పాలనా యంత్రాంగం మాత్రం మొద్దునిద్ర నటిస్తోంది. ముఖ్యంగా ఆర్థిక వ్యవహారాల్లో అక్రమాలకు పాల్పడిన ఇద్దరు ఉన్నతాధికారులపై కూడా క్రిమినల్ విచారణ జరపాలన్న సిఫారసును నీటి పారుదల శాఖ బుట్టదాఖలు చేసింది. మరోవైపు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వైఖరిపై కూడా సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విజిలెన్స్ నివేదిక అందగానే తక్షణ చర్యలు తీసుకోవాల్సిన మంత్రి, దానిపై సమీక్షల పేరుతో కాలయాపన చేశారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇదే సమయంలో ఏసీబీ అధికారులు నిర్వహించిన సోదాల్లో పలువురు ఇంజినీర్ల ఇళ్లలో కోట్లాది రూపాయల అక్రమ ఆస్తులు బయటపడటం సంచలనం సృష్టించింది. మాజీ ఈఎన్సీ హరిరామ్, మురళీధర్ వంటి వారి ఆస్తుల విలువ మార్కెట్ ధర ప్రకారం 400 కోట్లకు పైగానే ఉంటుందని ఏసీబీ తేల్చినా, ప్రభుత్వం వారిని శిక్షించే విషయంలో మాత్రం వెనకడుగు వేస్తోంది. ఈ జాప్యం వెనుక ఉన్న మతలబు ఏమిటన్నది



ఇప్పుడు సామాన్య ప్రజల మదిలో మెదులుతున్న ప్రశ్న. విజిలెన్స్ నివేదికపై తక్షణ నిర్ణయం తీసుకోకుండా, జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ నివేదిక వచ్చే వరకు వేచి చూడాలన్న ప్రభుత్వ నిర్ణయం బాధ్యులకు వరంగా మారింది. గతేడాది జూలైలో చంద్రఘోష్ నివేదిక అందడం, దానిని మంత్రిమండలి ఆమోదించడం వంటి ప్రక్రియలు చకచకా జరిగిపోయినా, క్షేత్రస్థాయిలో చర్యలు మాత్రం శూన్యం. అసెంబ్లీలో ఈ నివేదికను ప్రవేశపెడతామని, బాధ్యులను వదిలిపెట్టమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటనలు చేసినా, ఇప్పటి వరకు ఒక్క ఇంజినీరుపై కూడా వేటు పడలేదు. అసెంబ్లీలో సీబీఐ విచారణ కోరుతూ తీర్మానం చేసినా, అది కేవలం కేంద్రానికి లేఖలు రాయడానికే పరిమితమైందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇంతటి భారీ కుంభకోణంలో ఇంజినీర్లపై చర్యలు తీసుకోకపోవడానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెబుతున్న కారణాలు విడ్డూరంగా ఉన్నాయి. అధికారులు లేదా ఇంజినీర్లపై కఠినంగా వ్యవహరిస్తే శాఖలో పనులు ఆగిపోతాయని, వారు సహకరించరని మంత్రి ముఖ్యమంత్రికి వివరించినట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకే తాము పనులు చేశామని, ఇప్పుడు చర్యలు తీసుకుంటే భవిష్యత్తులో ఏ పనీ చేయలేమని ఇంజినీర్లు మంత్రికి ముందస్తు హెచ్చరికలు పంపినట్లు సమాచారం. ఈ రకమైన బ్లాక్ మెయిలింగ్‌కు ప్రభుత్వం తలొగ్గడం అంటే అవినీతిని ప్రోత్సహించడమేనని మేధావి వర్గం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. నిజానికి ఏ ప్రభుత్వంలోనైనా అధికారులు నిబంధనల ప్రకారం పనిచేయాలి కానీ, రాజకీయ నేతల అడుగులకు మడుగులు వత్తకూడదు. ఒకవేళ నేతలు తప్పు చేయమని ఒత్తిడి తెచ్చినా, దానిని అడ్డుకోవాల్సిన బాధ్యత ఐఏఎస్, ఐపీఎస్, ఇంజినీరింగ్ అధికారులపై ఉంటుంది. కానీ కాళేశ్వరం విషయంలో మాత్రం ఇంజినీర్లు పూర్తిగా లొంగిపోయి, అక్రమాలకు సహకరించారని విజిలెన్స్ నివేదిక స్పష్టంగా చెబుతోంది. ఇప్పుడు పనులు ఆగిపోతాయన్న సాకుతో వారిని వదిలేయడం వల్ల వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకం సడలిపోతోంది. ఇదంతా చూస్తుంటే బాధ్యులను కాపాడటానికే ప్రభుత్వం నాన్చుడు ధోరణిని అవలంబిస్తోందని స్పష్టమవుతోంది. రాజకీయ ప్రయోజనాల కోసం లేదా శాఖా పరమైన ఇబ్బందులు వస్తాయన్న భయంతో వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన వారిని వదిలేయడం అత్యంత ప్రమాదకరం. తెలంగాణ సెంటిమెంట్‌తో ముడిపడి ఉన్న ప్రాజెక్టులో ఇలాంటి అవకతవకలు జరిగితే, ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో పూర్తిగా రక్షణాత్మక ధోరణిలో ఉన్నట్లు కనిపిస్తోంది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇచ్చిన నివేదిక ఆధారంగా కేవలం షోకాజ్ నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకోవడం వల్ల ఎవరికీ ఒరిగేదేమీ లేదని సామాన్యులు సైతం చర్చించుకుంటున్నారు. ప్రజా కోర్టులో దోషులుగా నిలబడాల్సిన అధికారులు, నేడు ప్రభుత్వ అండదండలతో సేఫ్‌గా ఉండటం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు. విజిలెన్స్ కమిషన్ తన నివేదికలో పొందుపరిచిన అంశాలను పరిగణనలోకి తీసుకుంటే, ఇప్పటికే సగం మంది అధికారులు జైల్లో ఉండాలి. కానీ మన వ్యవస్థలో ఉన్న లొసుగులు, రాజకీయ నేతల స్వార్థం కారణంగా వారు స్వేచ్ఛగా తిరుగుతున్నారు. ప్రాజెక్టు ఫెయిల్యూర్ వల్ల జరిగిన నష్టాన్ని ప్రజలపై పన్నుల రూపంలో భారం వేసే ప్రభుత్వం, ఆ నష్టానికి కారణమైన వారిని మాత్రం ఎందుకు శిక్షించడం లేదనేది అపరిష్కృత ప్రశ్నగా మిగిలిపోయింది. మొత్తానికి కాళేశ్వరం అక్రమాల పర్వంలో అధికారులు, రాజకీయ నాయకుల మధ్య ఉన్న అంతర్గత ఒప్పందాలే విచారణకు అడ్డంకిగా మారాయని అర్థమవుతోంది. విజిలెన్స్ కమిషన్ నివేదికలోని సిఫారసులను తక్షణమే అమలు చేయకపోతే, భవిష్యత్తులో ఇలాంటి భారీ ప్రాజెక్టుల విషయంలో అధికారులకు జవాబుదారీతనం లేకుండా పోతుంది. ప్రభుత్వం ఇప్పటికైనా కాలయాపన వీడి, నివేదిక ఆధారంగా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటేనే వ్యవస్థ ప్రక్షాళన జరుగుతుంది. లేదంటే కాళేశ్వరం పేరుతో జరిగిన ఈ భారీ దోపిడీలో ప్రస్తుత పాలకులు కూడా భాగస్వాములేనన్న ముద్ర పడే ప్రమాదం ఉంది.

# కేసులన్నీ 'లొట్టపీసు' ఏనా?



**మొదటిపేజీ తరువాయి**

అసలు విచారణ తుది దశకు చేరడంలో జరుగుతున్న జాప్యం అనేక అనుమానాలకు తావిస్తోంది. ముఖ్యంగా కీలక నిందితులు నోరు విప్పకపోవడం దర్యాప్తు సంస్థలకు అతిపెద్ద సవాలుగా మారింది. కాళేశ్వరం అంశంలో కేసీఆర్ , హరీష్ రావులకు కోర్టు క్లీన్ చిట్ ఇవ్వలేదు కానీ, విచారణ జరిపిన తీరును తప్పుపట్టడం వారికి రాజకీయంగా పెద్ద ఆయుధంగా మారింది. "అసలు అక్కడ అవినీతే జరగలేదు.. కేవలం నాలుగు పిల్లర్లు కుంగిపోతే దాన్ని పట్టుకుని వేల కోట్లు స్వాహా చేశారని ప్రచారం చేస్తున్నారు" అంటూ వారు చేస్తున్న ఎదురుదాడి ఇప్పుడు సామాన్య ప్రజల్లోకి కూడా వెళ్తోంది. నాలుగు తట్టల ఇసుక, సిమెంట్ వేస్తే సరిపోయే చిన్న సమస్యను రేవంత్ రెడ్డి ప్రభుత్వం భూతద్దంలో చూపిస్తూ తమపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని వారు ఆరోపిస్తున్నారు. ఈ వాదనలకు తోడుగా ఇప్పుడు హైకోర్టు ఇచ్చిన తీర్పు వారిలో ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది. దీంతో విచారణ కమిషన్ల వల్ల ప్రయోజనం ఉందా అన్న చర్చ ఊపందుకుంది. ప్రస్తుతం కొనసాగుతున్న టెలిఫోన్ ట్యాపింగ్, ఫార్ములా రేస్ కేసుల్లో విచారణ నత్తనడకన సాగుతుండటంపై కూడా సర్వత్రా అసహనం వ్యక్తమవుతోంది. ఒకవైపు ప్రభుత్వం ఈ కేసులను లాజికల్ ఎండ్ కు తీసుకెళ్తామని చెబుతున్నా, వాస్తవ పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. దర్యాప్తు అధికారులు సేకరించిన డాక్యుమెంట్లు, డిజిటల్ ఆధారాలు రేపు కోర్టులో సాక్ష్యాలుగా నిలబడతాయా లేదా అన్నది ప్రధాన సంశయం. చట్టపరమైన చిక్కులు లేకుండా చార్జిషీటు దాఖలు చేయడంలో పోలీసులు ఏమాత్రం పొరపాట్లు చేసినా, అది నిందితులకు వరంగా మారుతుంది. ఇప్పటికే కేటీఆర్ వంటి నేతలు "ఇవి కేవలం లొట్టపీసు కేసులు" అని కొట్టిపారేయడం వెనుక ఉన్న మర్మం ఇదేనని విశ్లేషకులు భావిస్తున్నారు. దర్యాప్తు సంస్థల ముందు హాజరైనప్పుడు కూడా తాము అధికారులనే ఉల్టా ప్రశ్నలు అడిగి ఉక్కిరిబిక్కిరి చేశామని బీఆర్ఎస్ నేతలు ధీమాగా చెబుతున్నారు. ఈ ధీమా వెనుక ఉన్న అసలు కారణం విచారణా విధానాల్లో ఉండే లొసుగులేనని స్పష్టమవుతోంది. ఏదైనా కేసు కోర్టు మెట్లు ఎక్కినప్పుడు అక్కడ సాక్ష్యబలంతో పాటు విచారణా క్రమం కూడా అంతే ముఖ్యం. నిబంధనలకు విరుద్ధంగా సేకరించిన ఏ ఆధారమైనా చెల్లుబాటు కాదు. కాళేశ్వరం నివేదిక విషయంలో జరిగిన పొరపాట్లు ఇక్కడ కూడా పునరావృతమైతే, ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలన్నీ బూడిదలో పోసిన పన్నీరు అవుతాయి. రాబోయే ఎన్నికల నాటికి ఈ కేసుల్లో స్పష్టత వస్తుందా లేదా అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. అధికార దుర్వినియోగం జరిగిందని ప్రజలు భావిస్తున్నప్పటికీ, చట్టం తన పని తాను చేసుకుపోవడానికి అవసరమైన పక్కా ఆధారాలు సేకరించడంలో యంత్రాంగం వైఫల్యం చెందుతోందా అన్న కోణంలోనూ చర్చ జరుగుతోంది. టెలిఫోన్ ట్యాపింగ్ అనేది ఒక సున్నితమైన అంశం, ఇందులో ప్రైవసీ ఉల్లంఘనలతో పాటు జాతీయ భద్రతకు సంబంధించిన అంశాలు కూడా ముడిపడి ఉంటాయి. అయినప్పటికీ ఈ కేసులో ఇప్పటికీ ఒక స్పష్టమైన క్లైమాక్స్ కనిపించడం లేదు. కీలక వ్యక్తుల వాంగ్మూలాలు నమోదు చేయడంలో జాప్యం జరగడం వల్ల నిందితులు తమకు అనుకూలంగా పరిస్థితులను మార్చుకునే అవకాశం ఏర్పడుతుంది. ఇది చివరకు ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశ్నార్థకం చేసే ప్రమాదం ఉంది. ఫార్ములా రేస్ కేసులో నిధుల మళ్లింపు జరిగిందని ఆరోపణలు ఉన్నప్పటికీ, వాటిని నిరూపించడంలో అధికారులకు ఎదురవుతున్న అవరోధాలు అన్నీ ఇన్నీ కావు. అంతర్జాతీయ సంస్థలతో ముడిపడి ఉన్న వ్యవహారం కావడం వల్ల విదేశీ లావాదేవీల చిక్కుముడులు విప్పడం కత్తిమీద సాములా మారింది. ఈలోగా రాజకీయంగా జరుగుతున్న విమర్శలు ప్రతి విమర్శల వల్ల అసలు లక్ష్యం పక్కదారి పడుతోంది. జస్టిస్ ఘోష్ నివేదికపై హైకోర్టు చేసిన వ్యాఖ్యలు ఈ కేసుల దర్యాప్తు అధికారులకు ఒక హెచ్చరికగా మారాలి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా లేదా రాజకీయ ఒత్తిళ్లకు లోబడి నివేదికలు సిద్ధం చేసినా అవి న్యాయస్థానంలో నిలబడవని తేలిపోయింది. ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణ రాష్ట్ర రాజకీయాలు ఒక విచిత్రమైన మలుపు తిరిగాయి. అవినీతి జరిగిందని ఒక వర్గం గట్టిగా నమ్ముతుంటే, ఆ ఆరోపణల్లో పస లేదని మరో వర్గం వాదిస్తోంది. ఈ రెండింటి మధ్య సామాన్య పౌరుడు మాత్రం నిజం ఎప్పుడు బయటపడుతుందా అని ఎదురుచూస్తున్నాడు. దర్యాప్తు సంస్థలు తమ వృత్తిపరమైన నైపుణ్యాన్ని ఉపయోగించి ఎలాంటి లోపాలు లేని చార్జిషీట్లను సిద్ధం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే గతంలో లాగానే కేవలం అరెస్టులు, విచారణల పేరుతో కాలయాపన జరిగి చివరకు నిందితులు తప్పించుకునే అవకాశం ఉంటుంది. ఇది వ్యవస్థలపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని సడలిస్తుంది. రాజకీయ ప్రయోజనాల కోసం విచారణ కమిషన్లను వాడుకుంటున్నారనే ఆరోపణలకు చెక్ పెట్టాలంటే, నివేదికలు పక్కాగా ఉండాలి. జస్టిస్ ఘోష్ నివేదికపై జరిగిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోకపోతే, అది ప్రజాధనం వృథా చేయడమే అవుతుంది. వేల కోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన ప్రాజెక్టులు విఫలమైనప్పుడు బాధ్యులను శిక్షించడంలో విఫలమైతే అది భవిష్యత్తు తరాలకు తప్పుడు సంకేతాలను ఇస్తుంది. అదే సమయంలో రాజకీయ కక్షసాధింపు చర్యల కోసం దర్యాప్తు సంస్థలను ఉపయోగిస్తున్నారనే వాదనలకు బలం చేకూరకుండా చూడాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపై ఉంది. న్యాయ వ్యవస్థ ఎప్పుడూ ఆధారాలను మాత్రమే నమ్ముతుంది తప్ప భావోద్వేగాలను కాదు. కేటీఆర్, హరీష్ రావులలో కనిపిస్తున్న ఆ ధీమాకు కారణం కేవలం రాజకీయ వ్యూహం మాత్రమే కాదు, వారు చట్టంలోని లొసుగులను క్షుణ్ణంగా అవగాహన చేసుకోవడమే అని అర్థమవుతోంది. అందుకే వారు నిరంతరం ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ తాము నిర్దోషులమని గట్టిగా చెబుతున్నారు. ప్రభుత్వం కూడా తమ వద్ద ఉన్న ఆధారాలను త్వరితగతిన కోర్టు ముందు ఉంచితేనే ఈ అనుమానాలకు తెరపడుతుంది. లేనిపక్షంలో విచారణలు కేవలం పత్రికా ప్రకటనలకే పరిమితమై, అసలు దోషులు దర్జాగా తిరుగుతారనే భావన ప్రజల్లో బలోపేతం అవుతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకత అనేది నినాదంగా కాకుండా ఆచరణలో కనిపించాలి. మొత్తానికి తెలంగాణలో ఇప్పుడు జరుగుతున్న ఈ విచారణల పర్వం ఎటు దారితీస్తుందో అన్నది ఉత్కంఠ రేపుతోంది. కాళేశ్వరం నుంచి ట్యాపింగ్ వరకు, ఫార్ములా రేస్ నుంచి భూ కుంభకోణాల వరకు అన్నింటిలోనూ అసలు నిజాలు నిగ్గు తేలాలంటే పక్కా ప్రణాళికతో కూడిన దర్యాప్తు అవసరం. హైకోర్టు తాజా తీర్పు నేపథ్యంలో దర్యాప్తు సంస్థలు మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది. వచ్చే ఎన్నికల నాటికి ఈ కేసుల్లో ఏమైనా పురోగతి కనిపిస్తుందా లేక ఇవన్నీ కాలగర్భంలో కలిసిపోతాయా అన్నది వేచి చూడాలి. చివరకు చట్టం ఏ విధంగా స్పందిస్తుందో, రాజకీయ చదరంగంలో ఎవరు పైచేయి సాధిస్తారో కాలమే నిర్ణయించాలి.

# పొన్నం ప్రభాకర్‌పై శ్రీధర్ బాబు కుట్ర..?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయ ముఖచిత్రంపై ప్రస్తుతం ఆర్టీసీ సమ్మె వ్యవహారం తీవ్ర దుమారాన్ని రేపుతోంది. గత కొన్ని రోజులుగా కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం ఆందోళన బాట పట్టగా, అధికార పక్షం ఆరోపణలు, ప్రతిపక్షాల మద్దతుతో రాష్ట్రంలో రాజకీయ సెగలు రాజుకుంటున్నాయి. ఈ క్రమంలో భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు తమ పార్టీ నైతిక మద్దతును పూర్తిస్థాయిలో ప్రకటిస్తుందని స్పష్టం చేసిన కేటీఆర్, ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై మీడియా సమావేశంలో ఆయన మాట్లాడిన తీరు, ప్రభుత్వంపై సంధించిన విమర్శలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీశాయి. కాళేశ్వరం ప్రాజెక్టుపై హైకోర్టు ఇచ్చిన తీర్పు అనంతరం విలేకరులతో మాట్లాడిన కేటీఆర్, ఆర్టీసీ సమ్మె విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును తప్పుబట్టారు. ముఖ్యంగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. ఆర్టీసీ సమ్మె వెనుక బీఆర్ఎస్ హస్తం ఉందంటూ మంత్రి చేసిన వ్యాఖ్యల్లో వాస్తవం లేదని కేటీఆర్ కొట్టిపారేశారు. ప్రతిపక్ష పార్టీగా కార్మికుల పక్షాన నిలబడటం తమ బాధ్యతని, అంతేకానీ దీనిని రాజకీయ కుట్రగా చిత్రీకరించడం సమంజసం కాదని ఆయన హితవు పలికారు. కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అర్థం చేసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆయన ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యక్తిత్వం పట్ల తనకు గౌరవం ఉందని చెబుతూనే, గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను కేటీఆర్ గుర్తు చేశారు. ప్రస్తుత ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలోని మేనిఫెస్టో కమిటీ ఆర్టీసీ కార్మికుల కోసం ఇచ్చిన వాగ్దానాలను ఏ మేరకు అమలు చేశారో ఆత్మ



విమర్శ చేసుకోవాలని సూచించారు. మేనిఫెస్టోలోని 28వ పేజీలో ఆర్టీసీ కార్మికుల సంక్షేమం గురించి ఏం రాశారో ఒకసారి చదివితే వాస్తవాలు బయటకు వస్తాయని ఆయన సవాల్ విసిరారు. అధికారంలోకి రాకముందు ఒక మాట, వచ్చిన తర్వాత మరో మాట మాట్లాడటం కాంగ్రెస్ నైజమని కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆర్టీసీ కార్మికులు తమ డిమాండ్ల కోసం రెండున్నరేళ్ల పాటు ఎంతో ఓపికగా ఎదురుచూశారని, ఇక వారి సహనాన్ని పరీక్షించడం సరికాదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వ కాలపరిమితిలో ఇప్పటికే అరవై శాతం సమయం పూర్తయిందని, మూడు బడ్జెట్ సమావేశాలు కూడా ముగిసిపోయాయని ఆయన గుర్తు చేశారు. ఇన్ని అవకాశాలు ఉన్నా కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం జాప్యం చేయడం వల్లనే వారు రోడ్డు మీదకు రావాల్సిన పరిస్థితి ఏర్పడిందని విశ్లేషించారు. కార్మికులు అడుగుతున్నది కొత్త కోరికలేమీ కాదని, కేవలం మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలనే అమల్లోకి తీసుకురావాలని కోరుతున్నారని ఆయన స్పష్టం చేశారు. శ్రీధర్ బాబు రూపొందించిన మేనిఫెస్టోలో ఆర్టీసీ గురించి ఉన్న అంశాలను ప్రస్తావిస్తూ, మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కేటీఆర్ సున్నితమైన వ్యంగ్యంతో విమర్శించారు. ఒకవేళ పొన్నం ప్రభాకర్‌కు భవిష్యత్తులో రవాణా శాఖ మంత్రి పదవి వస్తుందని ముందే ఊహించి, శ్రీధర్ బాబు ఏమైనా కుట్ర పన్ని ఆ హామీలను అక్కడ చేర్చారో తనకు తెలియదని చమత్కరించారు. తాము మాత్రం ఎప్పుడూ కార్మికుల ప్రయోజనాల కోసమే ఆలోచిస్తామని, వారిని రెచ్చగొట్టాల్సిన అవసరం బీఆర్ఎస్ పార్టీకి లేదని ఆయన క్లారిటీ ఇచ్చారు. ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ప్రతిపక్షాలపై నెపం నెడుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు అత్యంత తీవ్రమైనవని, వారి వేతన సవరణ నుంచి మొదలుకొని పని పరిస్థితుల మెరుగుదల వరకు అనేక అంశాలు అపరిష్కృతంగా ఉన్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తక్షణమే చర్చలు జరపాలని ఆయన కోరారు. ప్రజా రవాణా వ్యవస్థలో కీలకమైన ఆర్టీసీని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, కార్మికులను ఇబ్బందులకు గురిచేయడం వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం పడుతుందని హెచ్చరించారు. రాజకీయ పంతాలకు పోకుండా మానవతా దృక్పథంతో ఆలోచించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కేటీఆర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్యారంటీలు అమలు చేయడంలో విఫలమవుతోందని, అందుకే ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని దారి మళ్లించేందుకు ఇలాంటి ఆరోపణలు చేస్తోందని ఆయన ఆరోపించారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె కేవలం వారి హక్కుల కోసం జరుగుతున్న పోరాటమని, దీనికి ఏ పార్టీతోనూ ముడిపెట్టడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ కార్మిక పక్షపాతిగానే ఉంటుందని, వారి పోరాటానికి తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం కార్మికులతో చర్చలు జరిపి సమ్మెను విరమింపజేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆర్టీసీ కార్మికులు పోషించిన పాత్రను కేటీఆర్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించిన కార్మికులను నేడు ప్రభుత్వం విస్మరించడం బాధాకరమని అన్నారు. వారి త్యాగాలను గుర్తించి గౌరవించాల్సింది పోయి, వారిపై రాజకీయ ముద్ర వేయడం కరెక్ట్ కాదని సూచించారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరిచి మేనిఫెస్టోలో చెప్పిన మాటలను నిలబెట్టుకోవాలని హితవు పలికారు. లేనిపక్షంలో కార్మికుల ఆగ్రహానికి ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని కేటీఆర్ హెచ్చరికలు జారీ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చేస్తున్న వ్యాఖ్యలు కేవలం తన బాధ్యత నుండి తప్పుకోవడానికేనని కేటీఆర్ విమర్శించారు. ఒక మంత్రిగా సమస్యను పరిష్కరించాల్సింది పోయి, ప్రతిపక్షాలపై నిందలు వేయడం ఆయన స్థాయికి తగదని అన్నారు. ఆర్టీసీలో జరుగుతున్న పరిణామాలను ప్రజలందరూ గమనిస్తున్నారని, ఎవరు ఎవరి కోసం పనిచేస్తున్నారో అందరికీ తెలుసని ఆయన పేర్కొన్నారు. మేనిఫెస్టోలో రాసిన ప్రతి అక్షరాన్ని అమలు చేసే వరకు తాము ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమని, కార్మికుల గొంతుకగా అసెంబ్లీ లోపల, బయట పోరాడుతామని కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ సమ్మె కారణంగా ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని కేటీఆర్ అన్నారు. సరైన ప్రణాళిక లేకుండా పాలన సాగించడం వల్లే ఇలాంటి గందరగోళ పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆయన దుయ్యబట్టారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి, బస్సులను తిరిగి రోడ్లపైకి వచ్చేలా చూడాలని ఆయన కోరారు. ప్రభుత్వ మొండి వైఖరి వల్ల సామాన్య ప్రజలు అవస్థలు పడుతున్నారని, ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని ఆయన తన ప్రసంగంలో స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం: రాజ్ ఠాకూర్



**విశాలభారతి, పాలకుర్తి:** పాలకుర్తి మండలం గుంటూరు పల్లి గ్రామంలో బుధవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉందని రైతులెవరు నష్టపోవద్దని సంకల్పంతో కొనుగోలు చేపడుతోందని అన్నారు. రైస్ మిల్లులను అప్రమత్తం చేస్తున్నామన్నారు. వరి పండించిన రైతులెవరు అధైర్య పడవద్దని మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తామని తెలిపారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం రైతుల ధాన్యాన్ని కటింగ్ పేరుతో నిలువు దోపిడి చేశారని 15 కిలోల నుండి 20 కిలోల వరకు కట్ చేసిన సందర్భాలు ఉన్నాయని అలాంటివి ఏవి లేకుండా నేడు ఒక్క గింజ కూడా కటింగ్ లేకుండా కొనుగోలు చేశామని తెలిపారు. రైతులు ఎవరు ఆధైర్యపడవద్దని రైతులకు వడగళ్ల వానలు వచ్చిన ఎలాంటి ఇబ్బందులు లేకుండా గన్ని సంచులు కవర్లు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. రైతులు పండించిన ప్రతి దాన్యపు గింజను కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## జన గణనలో నమోదు చేయాలి

**ఎన్యూమరేటర్లను కోరిన.నగర మేయర్**



**విశాలభారతి, ఎన్ టి పి సి:** రామగుండంలో స్థానికంగా నివాసం ఉంటున్న ప్రతి ఒక్కరి వివరాలు జన గణన లో నమోదు చేయాలని ఎన్యూమరేటర్ లను నగర మేయర్ మహంకాళి స్వామి కోరారు. ఎన్ టి పి సి . పి టి ఎస్ కాకతీయ కళ్యాణ మండపంలో జన గణన లో భాగంగా నిర్వహిస్తున్న రెండవ బ్యాచ్ ఎన్యూమరేటర్ల శిక్షణా శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డు , ఓటరు కార్డు , రేషన్ కార్డు స్వంత ఊళ్ళో ఉన్నా , మరో చోట ఉన్నా , రామగుండంలో నివాసం ఉంటున్నట్టయితే ఇక్కడ జన గణనలోనే వివరాలు నమోదు చేయాలని అన్నారు. గతంలో జరిగిన సర్వేలలో కొందరు అపోహలతో ఇక్కడ వివరాలు నమోదు చేసుకోకపోవడంతో జన సంఖ్య తగ్గినట్టుగా కనిపిస్తున్నదని అన్నారు. రామగుండం లో దిన దినాభి వృద్ధి జరుగుతున్న క్రమంలో జన సంఖ్య పెరిగిందని అన్నారు. స్వంత ఇల్లు లేకపోయినా ఏడాది లో ఎక్కువ కాలం ఇక్కడే గడుపుతున్నారు కాబట్టి ఇక్కడే వివరాలు నమోదు చేయాలని అన్నారు. తద్వారా రామగుండం లో జనాభాకు తగినట్లుగా వివిధ అభివృద్ధి , సంక్షేమ పథకాలలో ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొలని కవిత , వద్దూరి రవి నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి . అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు , ఎ సి పి శ్రీహరి , టి పి ఎస్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక రవాణాపై కట్టడి అధికారుల హెచ్చరిక



**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం దాదాసాహెబ్ కాలనీలో అనుమతి లేకుండా ఇసుక తవ్వకం, మరియు ట్రాక్టర్ల ద్వారా రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందడంతో అధికారులు చర్యలు చేపట్టారు. మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ కాసగాని రాజు, ఆధ్వర్యంలో టాస్కోఫోర్స్ బృందం కాలనీలో తనికీలు నిర్వహించి, ఇసుక ట్రాక్టర్ యజమానులు మరియు డ్రైవర్లకు కఠినంగా హెచ్చరికలు జారీ చేశారు. అనధికారికంగా ఇసుక తవ్వడం, రవాణా చేయడం చట్ట విరుద్ధమని, ఇసుకపై ఎవరైనా ఈ విధమైన చర్యలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, స్పష్టం చేశారు. అలాగే పర్యావరణ పరిరక్షణ ప్రభుత్వ నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ తనిఖీలు టాస్క్ ఫోర్స్ సభ్యులు అంబాల శ్రీధర్ గౌడ్, వెంకటేష్, పాశం యాకన్న, అజీముద్దీన్ పాల్గొని పరిస్థితులను సమీక్షించారు. స్థానికులు కూడా అధికారులకు సహకరించాలని కోరారు.

## లారీకి ఢీకొని కానిస్టేబుల్ మృతి

**దేవరుప్పుల, విశాలభారతి:** యాదాద్రి జిల్లా గుండాల మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ముత్యం మహేష్, (తండ్రి సోమయ్య) గ్రహౌజ్ కానిస్టేబుల్ తన అమ్మమ్మ ఊరు తిరుమలగిరి స్వగ్రామమైకి పల్సర్ మోటార్ సైకిల్ పై వెళ్తుండగా, ప్రమాదానికి గురయ్యాడు, ఎంఎన్ఆర్ గార్డెన్ దాటి కొద్ది దూరంలో నిర్లక్ష్యంగా నిలిపిన లారీని గమనించక ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం, ఈ ఘటనపై మృతుడి అన్న ముత్యం గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు దేవరుప్పుల ఎస్సై సృజన్ కుమార్ తెలిపారు.

## అంగన్వాడి సెంటర్లలో ఘనంగా జరిగిన ఫేర్వెల్ డే



**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం నిర్మల గ్రామంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు హరిజన కాలనీ నీర్మల ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి పూర్తి అయిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివగారి కిరణ్ కుమార్ అధ్యక్షతన ఘనంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. అదేవిధంగా అంగన్వాడి కేంద్రంలో యూకేజీ పూర్తి అయిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ పల్లెర్ల సంధ్యారాణి , విశిష్ట అతిథులుగా అంగన్వాడి సూపర్వైజర్ , చైల్డ్ హెల్ప్ లైన్ కౌన్సిలర్ మమత హాజరైనారు. విద్యార్థులచే కేక్ కట్ చేయించి సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పల్లెర్ల సంధ్యారాణి నవీన్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా మన హరిజన కాలనీ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి సెంటర్లు నడుస్తున్నాయని, కావున తల్లిదండ్రులు తమ పిల్లలను మన పాఠశాలలోనే, మన అంగన్వాడి సెంటర్ లోనే చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి పిల్లలందరూ సంవత్సరంలో నేర్చుకున్న అంశాలన్నీ ప్రదర్శించారు.

## ఎమ్మార్పీఎస్ ఆందోళన హెచ్చరిక



**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం కడవెండి గ్రామంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పడమటింటి నరసింహ మాదిగ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. బాల యేసు ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్ జేసుదాస్ విద్య హక్కు చట్టానికి విరుద్ధంగా ఆదివారం కూడా క్లాసులు నిర్వర్తిస్తూ పాఠశాల నడపడం, జి. కళావతి పై అనుచితంగా ప్రవర్తించడం ఖండించారు. వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేకపోతే నిరసనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల సీనియర్ నాయకులు కొంగరి రాములు, కడవెండి ఎమ్మార్పీఎస్ నాయకులు బాష్పాక పరశురాములు, శ్రీను, బాసిపాక కుమార్, పడమటింటి శ్రీను, బాశిపాక రాములు, మల్లేష్ ఇంజనీర్ బాలనర్సు, రవి, తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం నగర పాలక సంస్థకు రెండు ట్రాక్టర్లు, ఆటో ట్రాలీలు



**విశాలభారతి, గోదావరిఖని:** ప్రముఖ ప్రభుత్వ రంగ సంస్థ ఆర్ ఎఫ్ సి ఎల్ సామాజిక భాధ్యత గా రామగుండం నగర పాలక సంస్థ కు రూ 30 లక్షల విలువైన రెండు ట్రాక్టర్ లు , రెండు ఆటో ట్రాలీ లు ఇచ్చినందుకు రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి కృతజ్ఞతలు తెలిపారు . రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయ ఆవరణలో బుధవారం ఆర్ ఎఫ్ సి ఎల్ సంస్థ యూనిట్ హెడ్ శ్రీ ఎస్. కె. జిందాల్ ట్రాలీలతో సహా రెండు ట్రాక్టర్ లు (స్వరాజ్ 735 ఎఫ్ ఇ మోడల్ ) , రెండు ఆటో ట్రాలీ లను (మహేంద్రా సూపర్ క్యారీ ) నగర పాలక సంస్థకు అప్పగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ రామగుండం నగరం పూర్తిగా ఆర్ ఎఫ్ సి ఎల్ ప్రభావిత ప్రాంతమైనందున కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద మున్సిపల్ కార్పొరేషన్ కు మరింత సహకరించవల్సిన అవసరం ఉందని అన్నారు. తాము లేఖ రాసిన విధంగా మరో వెయ్యి వీధి దీపాలు కూడా ఇవ్వాలని కోరారు. లాభాల ప్రకారం ఐదు నుండి పదకొండు కోట్ల రూపాయలు సి ఎస్ ఆర్ కింద కేటాయించాల్సి ఉందని అన్నారు. ఆర్ ఎఫ్ సి ఎల్ సంస్థకు పూర్తి స్థాయిలో తాము సహకరిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు ).రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె, అరుణ శ్రీ , ఆర్ ఎఫ్ సి ఎల్ జి ఎం (ఓ అండ్ ఎం ) శ్రీ ప్రేమ్ కుమార్, సీనియర్ మేనేజర్ (సి ఎస్ ఆర్ ) వెంకట్ రెడ్డి , కంపనీ అధికారులతో పాటు కార్పొరేటర్లు కొలని కవిత , వద్దూరి రవి , నగర పాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

## రాజగోపాల్ రెడ్డి పోరాట ఫలితమే అండర్పాస్ నిర్మాణం

**పెద్దగోని రమేష్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు**



**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణంలో నిర్మితమవుతున్న ప్లైవుర్ నిర్మాణంలో భాగంగా బస్ స్టేషన్ దగ్గర వెహికల్ అండర్పాస్ నిర్మాణం కావాలని ప్రజల ఒత్తిడి మేరకు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారు ఎన్ హెచ్ ఏ ఐ అధికారులు రీజనల్ ఆఫీసర్ శివశంకర్ ని,పిడి శ్రీనివాస్ ని, చౌటుప్పల్ ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ ఇంచార్జ్ సైఫీ ని,డిఈ పని ని,మరియు జోషితో మాట్లాడి,తెలియజేసి తప్పనిసరిగా చౌటుప్పల్ లో పిల్లర్లతో కూడిన ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేయాలని లేదా వెహికల్ అండర్పాస్ ఇవ్వాలని వినతి మేరకు అధికారులు స్పందించి బస్టాండు ఇన్ ఫ్లేస్ బాలాజీ స్వీట్ హౌస్ ఎదురుగా 20 మీటర్ల వెడల్పుతో వెహికల్ అండర్పాస్ ఇవ్వడానికి మార్కింగ్ చేయడం జరిగింది.దీనిని అధికారికంగా ప్రకటించవలసి ఉంటుంది. వెహికల్ అండర్పాస్ మంజూరు చేయించిన మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు చౌటుప్పల్ ప్రజల తరఫున తెలియజేస్తున్నాం అని జవహర్ బాల్ మంచ్ రాష్ట్ర కో ఆర్డినేటర్ పెద్దగోని రమేష్ గౌడ్ పత్రిక పట్టణంలో తెలియజేసారు.

## తుర్కపల్లిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం



**యాదాద్రి భువనగిరి, విశాలభారతి:** జిల్లాలోని తుర్కపల్లి మండలంలోని పెద్దతండా, పల్లె పహాడ్, మాదాపూర్ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజకు సరైన ధర లభించేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించామని, ధాన్యం తేమ శాతం, తూకం విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. రైతులు మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా కేంద్రాలకు తమ ధాన్యాన్ని తీసుకురావాలని కోరుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే చేతుల మీదుగా సత్కారం




**ఆలేరు, విశాలభారతి:** ఆలేరు పట్టణానికి చెందిన 1వ వార్డు కౌన్సిలర్ పాకాల మౌనిక హరీష్ తండ్రి పాకాల రామ నరసయ్య, ఉద్యోగ విరమణ అభినందన సభ బుధవారం దొంతిరి సోమిరెడ్డి గార్డెన్లో ఘనంగా నిర్వాహస్తూ. మాజీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పాకాల రామ నరసయ్య శాలువాతో ఘనంగా సత్కరించారు. సందర్భంగా వారి సేవలను ప్రశంసిస్తూ భవిష్యత్తులో ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ. బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్, 3వ వార్డు కౌన్సిలర్ యాట శివ, 4వ వార్డు కౌన్సిలర్ కళ్యాణి మధు, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## సైబరాబాద్‌లో కల్తీ కలకలం

- ఎస్ఓటీ దాడుల్లో 28 మంది అరెస్ట్ -రూ.64 లక్షల సరుకు సీజ్
- జనవరి నుంచి సాగిన ఆపరేషన్‌లో 22 కేసుల నమోదు
- డీసీపీ ఎస్ఓటీ వెల్లడి

**సైబరాబాద్,విశాలభారతి:**

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో కల్తీ ఆహార తయారీ,విక్రయాలకు పాల్పడుతున్న ముఠాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నాలుగు నెలలుగా చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్ ఫలించింది.2026 జనవరి 1 నుంచి ఏప్రిల్ 21 వరకు జరిపిన వరుస దాడుల్లో 22 కేసులు నమోదు చేసి 28 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు డీసీపీ ఎస్ఓటీ సోమవారం విలేకరులకు తెలిపారు.సీజ్ చేసిన ఆహార పదార్థాలు,యంత్రాలు, వాహనాల విలువ సుమారు ₹64.07 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. పోలీసుల వివరాల ప్రకారం కూకట్‌పల్లి ఇండస్ట్రియల్ ఏరియాలోని ఓ షెడ్‌లో అర్ధరాత్రి 2:30 గంటల సమయంలో దాడి చేసి 5,026 లీటర్ల కల్తీ వంటనూనె,5,192 కిలోల నకిలీ గోధుమ పిండిని స్వాధీనం చేసుకున్నారు. అక్కడ ఆరుగురు నిందితులు పట్టుబడ్డారు.మియాపూర్‌బాచుపల్లి రోడ్డులోని పాడుబడ్డ గోదాంలో నకిలీ బ్రాండ్ లేబుళ్లతో అల్లంవెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తుండగా మరో నలుగురిని అదుపులోకి తీసుకున్నారు.హఫీజ్‌పేట్,మాదాపూర్ శివారులో ఎఫ్ఎస్ఎస్ఏఐ,ట్రేడ్ లైసెన్సులు లేకుండా బేకరీ ఉత్పత్తులు, స్వీట్స్,నమ్‌కీన్ తయారు చేస్తున్న మూడు యూనిట్లపై దాడి చేసి 18 మందిని అరెస్ట్ చేశారు.నిందితులు గడువు తీరిన ముడిసరుకు,నిషేధిత సింథటిక్ ఫుడ్ కలర్స్,హానికర రసాయనాలు వాడి ఆహార పదార్థాలు తయారు చేస్తున్నారని,వాడిన నూనెను శుద్ధి చేసి తిరిగి మార్కెట్‌లోకి పంపుతున్నారని విచారణలో వెల్లడైంది.సీజ్ చేసిన వాటిలో లేబులింగ్ మెషీన్లు,3 గూడ్స్ వాహనాలు,2 లారీలు కూడా ఉన్నాయి. ప్రజారోగ్యంతో ఆడుకుంటే పీడీ యాక్ట్ తప్పదు. లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే సరుకులు కొనాలి.ప్యాకెట్లపై ఎఫ్ఎస్ఎస్ఏఐ 14 అంకెల నంబర్,ఎక్స్‌పైరీ డేట్ తప్పక చూడాలి" అని డీసీపీ ఎస్ఓటీ ప్రజలకు సూచించారు. అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే డయల్ 100 లేదా 87126 60701 నంబర్‌కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని కోరారు.





## క్రీడలు పట్ల క్రీడాకారులకు క్రీడా స్ఫూర్తి అలవడుతుంది

**నాగ సీతారాములు**

**పాల్వంచ విశాలభారతి:** సంగం ప్రీమియర్ లీగ్ సీజన్ 4 క్రికెట్ టోర్నమెంట్ బహుమతులు అందచేసిన నాగ సీతారాములు. పాల్వంచ మండలం యస్. పీ. యల్.ఆర్గనైజర్స్ మెంటం బలరాం చింతల లక్ష్మణ్, పిల్లి సర్వేశ్, తిరుమలరెడ్డి శరత్, బోరం యేసు, రెంటాల సుందర్రావు మరియు పాల్వంచ మండలం కిసాన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మెంటం రాము ఆహ్వానం మేరకు టిపిసిసి జనరల్ సెక్రెటరీ నాగ సీతారాములు ముఖ్య అతిధిగా విచ్చేసి మాట్లాడుతూ సంగం ప్రీమియర్ లీగ్ సీజన్ 4 క్రికెట్ టోర్నీ గ్రాండ్ ఫైనల్ లో పాల్గొని గెలుపోటములు సహజమని క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో మెలగాలని, మాదకద్రవ్యాలు వదిలి క్రీడల పట్ల మక్కువ చూపి మానసికంగా శారీరకంగా దృఢంగా ఉండాలని క్రీడా స్ఫూర్తితో సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించి సమస్యల పరిష్కారం కోసం పాటుపడాలని సందేశం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సగం గ్రామ సర్పంచ్ బానోతు రవికుమార్, నాగారం సర్పంచ్ ధారావత్ స్వప్న, నారాయణరావుపేట ఉపసర్పంచ్ ఎర్రపోతు సంతోష్,మోదుంపురపు గణేష్, కంటి నరేష్, పాకాల కార్తీక్, అడ్వకేట్ శోభారాణి, స్వాతి స్కూల్ చైర్మన్ నీలిమ, బృందావన్ రెస్టారెంట్ , జై పార్క్ ఓనర్ జిల్ , సింగరేణి రిటైర్డ్ జనరల్ మేనేజర్ శనగ వెంకటేశ్వర్లు, ప్రముఖ జర్నలిస్టు శనగ రామచంద్ర రావు, టిఎస్ఆర్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



**మోటకొండూర్, విశాల భారతి:** మోటకొండూర్ మండలం పెద్దబావి (శాకంపల్లి) గ్రామంలో బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాటూర్ ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తూ. కార్యక్రమంలో పెద్దబావి గ్రామ సర్పంచ్ వేల్పుల రజిత శ్రీరాములు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొని. సర్పంచ్ రజిత శ్రీరాములు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లోనే అనుభవజ్ఞులైన, ఉన్నత విద్యావంతులైన ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని. బట్టీ పట్టే చదువులకు బదులుగా అర్థవంతమైన విద్యాబోధన అందిస్తున్నారని పేర్కొంటూ . విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు, మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలు అందుతున్నాయని, చదువుతో పాటు ఆటాపాటల్లోనూ నైపుణ్యాలు పెంపొందించేలా శిక్షణ ఇస్తున్నారని. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని పిలుపునిచ్చారు. ప్రధానోపాధ్యాయులు వీరవెల్లి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, మాటూర్ ఉన్నత పాఠశాలలో గత విద్యాసంవత్సరంలో పదవ తరగతి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని తెలుపుతూ . విద్యార్థుల స్థాయిని బట్టి బోధన నిర్వహిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయ బృందం ఎల్లవేళలా కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుగ్యాల లోకేష్ కుమార్, ఇల్లెందుల నరేందర్, గ్రామస్తులు ఉపేందర్, జోగయ్య, అశోక్, సురేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ సిరిమర్తి రేణుక నరసయ్య చేతుల మీదుగా ప్రారంభోత్సవం



**ఆలేరు,విశాలభారతి:** ఆలేరు మండలంలోని మందనపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు పిల్లలమర్రి లావణ్య భాస్కర్ నిర్మించిన నూతన ఇందిరమ్మ ఇల్లు బుధవారం గ్రామ సర్పంచ్ సిరిమర్తి రేణుక నరసయ్య చేతుల మీదుగా ప్రారంభించబడింది. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, కమిటీ సభ్యులు పాల్గొని లావణ్య భాస్కర్ కుటుంబానికి శుభాకాంక్షలు తెలుపుతూ. ప్రభుత్వం అందిస్తున్న గృహ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరడం ఆనందకరమని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పద్మ శ్రీ, శశిరేఖ సుదర్శన్, జిల్లా యూత్ నాయకులు ఉట్కూరు సురేష్, వార్డు సభ్యులు శ్రీలత కృష్ణ, అంజయ్య, సాయికుమార్, రాజు, గ్రామ శాఖ అధ్యక్షుడు వెంకటేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సిద్ధులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ లేబర్ కోడులకు వ్యతిరేకంగా సీఐటీయూ పిలుపు




**ఆలేరు,విశాలభారతి:** కార్మికుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న పని గంటల చట్టాలను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మేడే వారోత్సవాలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరు మల్లేశం కార్మికులకు పిలుపునిచ్చారు. బుధవారం ఆలేరు మండల కేంద్రంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు మరిగాడి రమేష్ అధ్యక్షతన మండల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కల్లూరు మల్లేశం మాట్లాడుతూ, 140 ఏళ్ల క్రితం చికాగో నగరంలో ఎనిమిది గంటల పని దినం కోసం కార్మికులు చేసిన పోరాటం ప్రపంచ కార్మిక వర్గానికి దిక్సూచిగా నిలిచిందని గుర్తు చేశారు. ఆనాడు కార్మికులు చిందించిన రక్తం ఫలితంగానే ఎనిమిది గంటల పని విధానం, కనీస వేతనాలు, ఇతర కార్మిక హక్కులు చట్టబద్ధమయ్యాయని పేర్కొని . ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటిని నాలుగు కార్పొరేట్ అనుకూల లేబర్ కోడులుగా మార్చడం కార్మిక వర్గానికి పెను ప్రమాదమని హెచ్చరించారు. మేడే వారోత్సవాల ద్వారా కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, మహిళా కార్మికులు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# సమ్మెతో స్తంభించిన ఆర్టీసీ



**యాదాద్రి భువనగిరి,విశాలభారతి:** తెలంగాణ వ్యాప్తంగా కొనసాగిన ఆర్టీసీ కార్మికుల సమ్మె ప్రభావం యాదాద్రి భువనగిరి జిల్లాలో బుధవారం తీవ్రంగా కనిపించింది. ప్రభుత్వంతో చర్చలు విఫలమవడంతో నిన్న అర్ధరాత్రి నుంచి సమ్మె ప్రారంభమై బస్సు సర్వీసులు పూర్తిగా నిలిచిపోయాయి. జిల్లాలో ఉన్న ఒకేఒక ఆర్టీసీ డిపో యాదగిరిగుట్టలో ఉండగా, అక్కడి బస్సులు డిపోకే పరిమితమయ్యాయి. దీంతో రోడ్లపై బస్సులు కనిపించక రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించింది. డిపో వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని పర్యవేక్షించారు. జిల్లా కేంద్రంతో పాటు ఆలేరు, మోత్కూరు, చౌటుప్పల్ ప్రాంతాల్లోని బస్టాండ్లు కూడా ప్రయాణికులు లేక ఖాళీగా కనిపించాయి. సాధారణంగా రద్దీగా ఉండే ఈ బస్టాండ్లు వెలవెలబోసిన దృశ్యాన్ని సంతరించుకున్నాయి. బస్సులు లేకపోవడంతో ఉద్యోగులు, విద్యార్థులు, సాధారణ ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# పుప్పాలగూడ సబ్‌స్టేషన్‌లో ఫెడరేషన్

**అధికారుల సానుకూల చర్చలు**



**రాజేంద్రనగర్, విశాలభారతి :** ఫెడరేషన్‌కు చెందిన వివిధ కాలనీల ప్రతినిధులు పుప్పాలగూడ సబ్‌స్టేషన్‌లో సీఎండీ జితేష్ వి. పాటిల్ , డైరెక్టర్ (ఆపరేషన్స్) నరసింహులు , ఎస్ఈ చంద్రశేఖర్ , డీఈ రమేష్ చంద్ర మరియు ఇతర అధికారులను కలిశారు. ఈ సమావేశం చాలా సానుకూలంగా మరియు ముందుచూపుతో సాగింది. మణికొండకు సంబంధించిన ముఖ్యమైన అంశాలు అయిన కొత్త విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటు, విద్యుత్ స్తంభాల మార్పు, భూగర్భ కేబులింగ్ పనులపై విస్తృతంగా చర్చ జరిగింది. సీఎండీ సానుకూలంగా స్పందించి, ఈ పనులను త్వరితగతిన ముందుకు తీసుకెళ్లేందుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. మొత్తంగా ఇది ఒక ఫలప్రదమైన సమావేశంగా నిలిచి, మణికొండలో మౌలిక వసతుల అభివృద్ధికి ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలిచింది.

# విద్య ద్వారానే ఉన్నత లక్ష్యాలు

**ముషీరాబాద్,విశాలభారతి:** విద్య ద్వారానే ఉన్నత లక్ష్యాలను నిర్ధారించుకునేలా భవిష్యత్తు ఉంటుందని డిఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ పేర్కొంది. గుండ్ల పోచంపల్లి లోని డిఆర్ఎస్ ఐఎస్ క్యాంపస్ లో బుధవారం సీబీఎస్సీఈ పదవ తరగతి టాపర్ల అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన టాపర్లను స్కూల్ మేనేజ్మెంట్ ఘనంగా సత్కరించి అభినందించింది. విద్యతోపాటు స్కిల్స్, సెల్ఫ్ డెవలప్మెంట్ నేర్చుకుని దేశానికి బాధ్యతయుతమైన ఆదర్శప్రాయమైన పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించింది. ఈ అభినందన సభలో ప్రిన్సిపల్ ఐ వేణుగోపాల్, మేరీ తనూజ, రాజేంద్రప్రసాద్ టీచర్స్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# 'కాళేశ్వరం బాధ్యులను వదిలిపెట్టం'

- కోర్టు తీర్పు బీఆర్ఎస్‌కు విముక్తి కాదు
- నివేదికలన్నీ ప్రాజెక్టులో అక్రమాలను తేల్చాయి
- హైకోర్టు తీర్పుతో విచారణ ఆగిపోదు
- కాళేశ్వరాన్ని బీఆర్ఎస్ ఏటీఎంలా వాడుకుంది
- సీబీఐ విచారణపై కేంద్రం ఎందుకు స్పందించడం లేదు?
- అన్ని కుంభకోణాల్లో బాధ్యులను వదిలిపెట్టం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంపై పీసీ ఘోష్ కమిషన్ విచారణ నేపథ్యంలో హైకోర్టు వెలువరించిన తీర్పుపై రాజకీయ దుమారం రేగుతోంది. ఈ క్రమంలోనే పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ బుధవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. హైకోర్టు ఇచ్చిన తీర్పును బీఆర్ఎస్ నేతలు తమకు అనుకూలంగా మార్చుకుంటూ సంబురాలు చేసుకోవడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ తీర్పు అస్సలు క్లీన్ చిట్ కాదని, కేవలం సాంకేతిక అంశాలపై వచ్చిన తీర్పును పట్టుకుని విజయోత్సవాలు జరుపుకోవడం హాస్యాస్పదంగా ఉందని ఆయన విమర్శించారు. ప్రాజెక్టు వైఫల్యంపై నిజాలు దాచిపెట్టలేరని ఆయన స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో గత ప్రభుత్వం భారీ ఎత్తున అవినీతికి పాల్పడిందని రాష్ట్ర ప్రజలు బలంగా నమ్ముతున్నారని, అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బాధ్యతాయుతంగా విచారణకు ఆదేశించిందని మహేశ్ కుమార్ గౌడ్ గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టు కేవలం ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయడానికి ఒక సాధనంగా మారిందని, బీఆర్ఎస్ పార్టీకి ఇది ఏటీఎంలా పనిచేసిందని ఆయన ఘాటుగా ఆరోపించారు. రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి నిర్మించిన ఈ ప్రాజెక్టు ద్వారా ప్రజలకు ఒరిగిన ప్రయోజనం కంటే పాలకులకు అందిన కమిషన్లే ఎక్కువని ఆయన వ్యాఖ్యానించారు. ప్రాజెక్టులో జరిగిన అక్రమాలపై ఇప్పటికే విజిలెన్స్ విచారణతో పాటు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికలు కూడా వచ్చాయని మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం ఎంత లోపభూయిష్టంగా ఉందో ఈ నివేదికలు స్పష్టం చేస్తున్నాయని ఆయన తెలిపారు. కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ విమర్శలు చేయడం లేదని, సంబంధిత సంస్థలు ఇచ్చిన ఆధారాలతోనే తాము మాట్లాడుతున్నామని వివరించారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడం నుంచి మొదలుకొని అనేక సాంకేతిక పరమైన లోపాలు విజిలెన్స్ ఎంక్వైరీలో తేటతెల్లం అయ్యాయని ఆయన మీడియా ప్రతినిధులకు వివరించారు. హైకోర్టు తీర్పు విచారణ ప్రక్రియకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆటంకం కాదని పీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. ప్రాజెక్టు అవినీతిపై లోతైన పరిశీలన కొనసాగుతూనే ఉంటుందని, బాధ్యులైన వారిని తప్పకుండా చట్టం ముందు నిలబెడతామని ఆయన భరోసా ఇచ్చారు. న్యాయ వ్యవస్థ గౌరవాన్ని కాపాడుతూనే, ప్రజా ధనం దుర్వినియోగం అయిన తీరును వెలికి తీయడం తమ ప్రభుత్వ బాధ్యతని పేర్కొన్నారు. ప్రాజెక్టు వైఫల్యాలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపించిన ఘోష్ కమిషన్ నివేదికలో అనేక విస్తుపోయే విషయాలు ఉన్నాయని, అవి త్వరలోనే బహిర్గతం అవుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. తమ ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతిలో విచారణను ముందుకు తీసుకెళ్తోందని, పాత పాలకుల తరహాలో అరాచక నిర్ణయాలు తీసుకోవడం లేదని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. చట్టబద్ధమైన సంస్థల ద్వారా పూర్తి ఆధారాలతో విచారణ జరిపిస్తున్నామని, దీని వల్ల అసలు నిజాలు బయటకు రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు ఎంతగా తప్పించుకోవాలని చూసినా ప్రజల ముందు వారు దోషులుగా నిలబడక తప్పదని హెచ్చరించారు. ప్రతి పైసా లెక్క తేలుస్తామని, విచారణలో ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన తీవ్ర స్వరం తో స్పష్టం చేశారు. గత ప్రభుత్వంపై చర్యలు తీసుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెనకాడుతోందంటూ వస్తున్న విమర్శలపై మహేశ్ కుమార్ గౌడ్ గట్టిగా స్పందించారు. తాము అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని, ఈ క్రమంలోనే సీబీఐ విచారణ కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాశామని గుర్తు చేశారు. అయితే రాష్ట్రంలో జరుగుతున్న ఇంత పెద్ద కుంభకోణంపై కేంద్రం ఎందుకు మౌనంగా ఉంటుందో అర్థం కావడం లేదని ఆయన విస్మయం వ్యక్తం చేశారు. సీబీఐ ఎంక్వైరీకి కేంద్రం ఎందుకు ముందుకు రావడం లేదో బీజేపీ నేతలు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో తమ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని, అవకతకవలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా శిక్షార్హులేనని ఆయన అన్నారు. గత పదేళ్ల పాలనలో జరిగిన అక్రమాలపై కఠినంగా వ్యవహరిస్తామని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా పాలన సాగిస్తామని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మరో రెండున్నర ఏళ్లు సుస్థిరంగా అధికారంలో ఉంటుందని, ఈ కాలంలోనే అన్ని విచారణలను కొలిక్కి తీసుకొస్తామని స్పష్టం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో ఏమాత్రం తాత్సారం చేయబోమని ఆయన పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం, ఈ కారు రేసు నిర్వహణలో జరిగిన అక్రమాలు, అలాగే కాళేశ్వరం అవినీతి వంటి ప్రధాన అంశాలన్నింటిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మహేశ్ కుమార్ గౌడ్ వివరించారు. ఈ కేసుల్లో చిక్కుకున్న వారు ఎవరైనా సరే చట్టం నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు. విచారణ సంస్థలకు పూర్తి స్వేచ్ఛనిచ్చామని, ఎక్కడా రాజకీయ జోక్యం లేకుండా పారదర్శకంగా విచారణ సాగుతోందని వెల్లడించారు. ప్రభుత్వం తన పని తాను చేసుకుపోతుందని, ప్రజలకు అన్ని విషయాలు త్వరలోనే తెలుస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, బీజేపీలు లోపాయికారీ ఒప్పందాలతో వ్యవహరిస్తున్నాయని మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. అందుకే కాళేశ్వరం అవినీతిపై కేంద్రం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. రాష్ట్ర బీజేపీ నేతలు కేవలం ప్రగల్భాలు పలుకుతున్నారే తప్ప, కేంద్రంపై ఒత్తిడి తెచ్చి సీబీఐ విచారణ చేయించడంలో విఫలమయ్యారని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం మాత్రం ఎవరికీ భయపడకుండా ప్రజల పక్షాన నిలబడి పోరాడుతుందని, అవినీతి అంతమే లక్ష్యంగా పనిచేస్తుందని చెప్పారు. రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా వ్యవస్థను ప్రక్షాళన చేయడమే తమ ప్రాధాన్యమని తెలిపారు. ఈ ప్రాజెక్టు వల్ల రైతులకు కలిగిన ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువని, వేల కోట్ల రూపాయల వడ్డీల భారం రాష్ట్ర ప్రజలపై పడిందని మహేశ్ కుమార్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం కమిషన్ల కక్కుర్తితోనే డిజైన్లను మార్చి ప్రాజెక్టును నాశనం చేశారని దుయ్యబట్టారు. ఈ పాపంలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరూ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కుదేలు చేసిన ఇటువంటి ప్రాజెక్టుల విషయంలో నిర్లక్ష్యం వహించే ప్రసక్తే లేదని, ప్రతి రూపాయికి లెక్కలు బయటకు తీసి ప్రజలకు చూపిస్తామని ఆయన ఘంటాపథంగా చెప్పారు. చివరిగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల ఆశీస్సులతో ఏర్పడిన తమ ప్రభుత్వం ప్రజా ధనాన్ని రక్షించడంలో నిరంతరం శ్రమిస్తుందని స్పష్టం చేశారు. న్యాయ ప్రక్రియలో కొన్ని జాప్యాలు జరగవచ్చని, కానీ అంతిమంగా ధర్మమే గెలుస్తుందని మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఢిల్లీ వేదికగా ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టుపై రానున్న రోజుల్లో మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని, రాజకీయ పరిణామాలు వేగంగా మారతాయని ఆయన మాటలను బట్టి స్పష్టమవుతోంది.

# పోరాట స్ఫూర్తికి ప్రతీకగా గుండం రాజుపల్లి

- అంబేద్కర్–పాపన్న–ఏకలవ్య–బుచ్చయ్య విగ్రహాల ఆవిష్కరణ
- కమలాకర్‌పై ఎమ్మెల్యే రామచంద్ర నాయక్ ప్రశంసల వర్షం
- వేలాదిగా తరలివచ్చిన ప్రజలు – హోరెత్తిన సభ

**మరిపెడ, విశాలభారతి:**



గుండం రాజుపల్లి గ్రామం పోరాట స్ఫూర్తి, సామాజిక చైతన్యానికి ప్రతీకగా మరోసారి నిలిచింది. గ్రామంలో డా. బీఆర్ అంబేద్కర్, సర్దార్ సర్వాయి పాపన్న, ఏకలవ్య, గునిగంటి బుచ్చయ్యల విగ్రహాలను అట్టహాసంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్ర నాయక్ హాజరై విగ్రహాలను ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ తక్కలపల్లి రవీందర్ రావు, ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాసిం పాల్గొని సభకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

**కమలాకర్‌పై ఎమ్మెల్యే ప్రశంసలు**

సభలో మాట్లాడిన ఎమ్మెల్యే రామచంద్ర నాయక్ కమలాకర్‌పై ప్రశంసల జల్లు కురిపించారు. "మొదట కమలాకర్‌ను జెడ్పిటిసి చేయాలని అనుకున్నాను. కానీ రిజర్వేషన్ అనుకూలించకపోవడంతో జెడ్పిటిసి ఎన్నికల్లో అవకాశం రాలేదు. అందుకే సర్పంచ్‌గా పోటీ చేయమని నేనే సూచించాను," అని తెలిపారు. కమలాకర్ నాయకత్వం, ప్రజల పట్ల అంకితభావం గురించి ప్రస్తావిస్తూ, గ్రామ అభివృద్ధికి అతను చేసిన కృషి అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

**హోరెత్తిన సభ – ప్రజల స్పందన**

గ్రామంలో ఏర్పాటు చేసిన సభకు వేలాదిగా ప్రజలు తరలి వచ్చారు. సభ ప్రాంగణం జన సందోహంతో కిక్కిరిసిపోయింది. నాయకుల ప్రసంగాలకు గ్రామస్తులు చప్పట్లతో స్పందిస్తూ సభను ఉత్సాహభరితంగా మార్చారు.

**సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి**

కార్యక్రమంలో జబర్దస్త్ టీమ్ సభ్యులు పాటలు, వినోదాత్మక ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. మానుకోట ప్రసాద్ తన పాటలతో సభకు శ్రీకారం చుట్టగా, తర్వాత సాగిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

**వేలమందికి అన్నదానం**

కార్యక్రమానికి హాజరైన వేలాది మంది ప్రజలకు భోజనాలు ఏర్పాటు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్రామస్థులు, నిర్వాహకులు కలిసి సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**సభ విజయంపై ప్రశంసల వెల్లువ**

ఇంత పెద్ద స్థాయిలో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు కమలాకర్‌పై నాయకులు, గ్రామస్తులు ప్రశంసల వర్షం కురిపించారు. గుండం రాజుపల్లి గ్రామం పోరాటాల ప్రతీకగా నిలుస్తూనే, సామాజిక ఐక్యతకు మార్గదర్శకంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీ నాయకులు, కవులు, వక్తలు, వివిధ కుల ప్రజా సంఘ నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఘనంగా సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

**లెనిన్ జయంతి సందర్భంగా విప్లవ స్ఫూర్తితో మహబూబాబాద్‌లో సభ**

**మహబూబాబాద్ , విశాలభారతి:**

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ 57వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మార్క్సిస్టు మహోపాధ్యాయుడు లెనిన్ 156వ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి. సనప పొమ్మన్న జెండాను ఆవిష్కరించగా, ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోకన్నా విప్లవోద్యమ చరిత్రను విశదీకరించారు. ఆయన మాట్లాడుతూ 1870లో లెనిన్ జన్మదినం రోజున సిపిఐ (ఎంఎల్) పార్టీ స్థాపన భారత రాజకీయ చరిత్రలో కీలక మలుపుగా నిలిచిందన్నారు. తెలంగాణా సాయుధ పోరాటం అనంతరం నక్సల్బరీ ఉద్యమం ప్రజల్లో విప్లవ చైతన్యాన్ని రగిలించిందని పేర్కొన్నారు. భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన పోరాటాలు సామాన్య ప్రజల జీవితాల్లో మార్పులకు దారితీశాయని వివరించారు. పగిడేరు ఘటనతో ప్రారంభమైన సాయుధ పోరాటం గోదావరి లోయలో ప్రతిఘటనా పోరాటాలుగా విస్తరించిందని, ఈ పోరాటాల ఫలితంగానే ఆదివాసీలు లక్షల ఎకరాల భూములను సాగు చేసుకునే హక్కును పొందారని తెలిపారు. కార్యక్రమంలో పి ఓ డబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి శారు కవిత, పిడిఎస్యు రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్, పి ఓ డబ్ల్యు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చందా అరుణ, పి ఓ డబ్ల్యు రాష్ట్ర నాయకులు భాగ్యలక్ష్మి, ఏఐకేఎంఎస్ నర్సిరెడ్డి, సట్ల యాకయ్య, వీరన్న, పి వై ఎల్ నాయకులు గుగులోతు గణేష్, భావన ఋషి, పిఓడబ్ల్యూ నాయకురాలు అనురాధ, రేఖ, శ్రీనివాస్, తదితరులు నాయకులు పాల్గొన్నారు.



# ఆధారిత రంగాల్లో తెలంగాణ పురోగమణం

**మంత్రి శ్రీధర్ బాబు**




**ముషీరాబాద్,విశాలభారతి:** పరిశ్రమలు ఆవిష్కరణల ఆధారిత రంగాల్లో తెలంగాణ పురోగమిస్తుందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఈ తరుణంలో పురోగతికి తోడ్పడే విద్య పునాదిని బలోపేతం చేయడం అంతకంటే ముఖ్యమని పేర్కొన్నారు. బుధవారం ఆర్టిసి కళ్యాణ మండపంలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సి ఎస్ ఆర్ స్కాలర్‌షిప్ కార్యక్రమాన్ని మంత్రి శ్రీధర్ బాబు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణలోని 5050 మంది విద్యార్థులకు 4.55 కోట్ల విలువైన స్కాలర్‌షిప్లను పంపిణీ చేసి మాట్లాడారు. భవిష్యత్తు విద్యార్థులదే కాబట్టి లక్ష్యాన్ని నిర్ధారించుకొని ఆ దిశగా ముందుకు వెళ్లాలని విద్యార్థులకు సూచించారు. విద్యాభివృద్ధిని మరింత బలోపేతం చేయవలసిన అవసరం ఉందన్నారు. పేద విద్యార్థుల చదువుకు డబ్బు ఆటంకం కలగకూడదని సీఎం రేవంత్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. సి ఎస్ ఆర్ లో భాగంగా మరిన్ని కార్పొరేట్ సంస్థలు భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మలబార్ గ్రూప్ చైర్మన్ అహ్మద్, ఆషర్, సిరాజ్, ఇళమ్ గోవన్, షరీజ్ తోపాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# తిరునక్షత్ర మహోత్సవాలు ఘనంగా ప్రారంభం



**రాజేంద్రనగర్, విశాలభారతి:** ముచ్చింతల్ శ్రీరామ నగరంలో స్టాట్యూ అఫ్ ఈక్వలిటీ ప్రాంగణంలో శ్రీ భగవద్ రామానుజచార్య స్వామి వారి 1009వ తిరునక్షత్ర మహోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తిరునక్షత్ర మహోత్సవ వేడుకల్లో తొలి రోజు ఉదయం సువర్ణ రామానుజ మూర్తికి తిరుమంజన సేవతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ పూజలను త్రిదండి చిన్న జీయర్ స్వామి వారి పర్యవేక్షణలో నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి మాట్లాడుతూ ఆత్మ జ్ఞానం చాలా ముఖ్యమైనదన్నారు. శ్రీ భగవద్ రామానుజచార్య సమాజానికి అందించిన సమానత్వ సందేశం అందరికి ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో మైహోమ్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ జూపల్లి రామేశ్వర్ రావు దంపతులు పాల్గొన్నారు. ఐదు రోజుల పాటు కొనసాగే ఈ వేడుకల్లో వివిధ ఆధ్యాత్మిక, భక్తి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

# మియాపూర్‌లో ఆర్టీసీ కార్మికుల ధర్నా

**ఏఐటీయూసీ,సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె.. డిమాండ్ల సాధనకై నినాదాలు**




**శేరిలింగంపల్లి, విశాలభారతి:** ప్రభుత్వం తమ డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని కోరుతూ ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు బుధవారం హెచ్ సి యు డిపో ఎదుట ధర్నాకు దిగారు. డ్రైవర్లు,కండక్టర్లు సహ కార్మికులు పెద్ద సంఖ్యలో నిరసనలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం,వేతన సవరణ అమలు,బకాయిల చెల్లింపు,ఉద్యోగ భద్రత కల్పించడం తదితర డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని యూనియన్ నేతలు స్పష్టం చేశారు. కార్మికుల సమ్మెతో డిపో నుంచి బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి.ఈ కార్యక్రమంలో సీఐటీయూ శేరిలింగంపల్లి కార్యదర్శి కొంగరి కృష్ణ,ఏఐటీయూసీ కార్యదర్శి రామకృష్ణ,నాయకుడు చందు యాదవ్,డ్రైవర్లు,కార్మికులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

**వాజేడు, విశాలభారతి:** ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని పేరూరు గ్రామపంచాయతీ చిన్నగొల్లగూడెం గ్రామానికి చెందిన తాటి లక్ష్మి w/0 తిరుపతిరావు అనారోగ్యంతో ఆసుపత్రి ఆర్థికంగా నష్టపోయింది. ఆమె సీఎం రిలీఫ్ ఫండ్ కు అప్లై చేసుకోవడంతో 26వేల రూపాయల మంజూరైన చెక్కును కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ నాగారం సర్పంచ్ బోదెబోయిన స్వరూప చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విక్రాంత్ మాట్లాడుతూ.. ఎవరైనా అనారోగ్య పాలై ఆర్థికంగా నష్టపోయి ఉన్న వారు ఆసుపత్రి బిల్లులతో సీఎం రిలీఫ్ ఫండ్ అప్లై చేసుకున్నట్లయితే వెంటనే లబ్దిదారులకు ఆర్థిక సహాయం ప్రజా ప్రభుత్వం అందిస్తుందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మునుగోడు అభివృద్ధిపై నిజాయితీగా పనిచేయాలి

- రాజగోపాల్ రెడ్డి మళ్ళీ రాజీనామా చేసి పోటీ చేయాలని సవాల్
- కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే



**చౌటుప్పల్ విశాలభారతి:** మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రాజీనామా చేసి మళ్లీ పోటీ చేయాలని సవాల్ విసిరిన మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి.ఎంపీటీసీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ నాయకులు ఆయన వెంట ఉండరని ఆయన తెలిపారు. మున్సిపల్ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ..మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాటలు కోటలు దాటుతాయి కాని చేతలు గడప కూడా దాటవని,అధికార పార్టీలో ఉండి కూడా ప్రతిపక్ష ఎమ్మెల్యేగా కొనసాగుతూ నియోజకవర్గానికి కనీసం నిధులు తీసుకురాలేకపోతున్న అసమర్ధ ఎమ్మెల్యే అని దుయ్యాబట్టారు. మునుగోడు ప్రాంత భౌగోళిక స్వరూపం గురించి ఈ ఎమ్మెల్యేకి కనీస అవగాహన లేదు అని,కేవలం తన ఉనికి మంత్రి పదవి కోసం మాత్రమే తాపత్రయ అని అన్నారు. సోషల్ మీడియాలో రీల్స్ పెట్టించుకుని హైప్ క్రియేట్ చేసుకోవడం తప్ప వాస్తవ అభివృద్ధి లేదు.అభివృద్ధి రీల్స్‌లో మాత్రమే కనిపిస్తుందని తెలిపారు. నేను కేసీఆర్ మార్గదర్శకత్వంలో మునుగోడు నియోజకవర్గానికి వందల కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాను.మిషన్ భగీరథ,మిషన్ కాకతీయ,ఫ్లోరైడ్ నిర్మూలన,మున్సిపాలిటీలు,సీసీ రోడ్లు, డ్రైనేజీలు, 100 పడకల ఆసుపత్రి——అమలు చేశాం అని తెలిపారు. చౌటుప్పల్ వద్ద ఫ్లైఓవర్ పనుల్లో ఎలివేటెడ్ కారిడార్ కోసం మేము పోరాడుతుంటే ఎమ్మెల్యే స్పందన ఇది అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి,మాజీ జెడ్పిటిసి పెద్దింటి బుచ్చిరెడ్డి, బి ఆర్ యస్ మండల పార్టీ అధ్యక్షులు గిర్కటి నిరంజన్ గౌడ్,పట్టణ అధ్యక్షులు బొమ్మిరెడ్డి వెంకటరెడ్డి యువజన సంఘం నాయకులు చెవగోని మహేష్ గౌడ్,ఎండి మున్నా మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మొయినాబాద్ కేంద్రంలో స్వర్గీయ పట్లోళ్ల ఇంద్రారెడ్డి వర్ధంతి వేడుకలు



**మొయినాబాద్, విశాలభారతి:** మాజీ హోంమంత్రి పట్లోళ్ల ఇంద్రారెడ్డి 26వ వర్ధంతి వేడుకలు మొయినాబాద్ కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన సతీమణి సబితా రెడ్డి స్వర్గీయ పట్లోళ్ల ఇంద్రారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చేవెళ్ల ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిన నేత పట్లోళ్ల ఇంద్రారెడ్డి అని అన్నారు. చేవెళ్ల ప్రజల ఆదరణ ఎప్పటికీ మరిచిపోలేమని, చేవెళ్ల ప్రజలు రాజకీయ జీవితం ఇచ్చినందుకే రాష్ట్ర ప్రజలకు సేవలు చేసే అవకాశం వచ్చిందన్నారు. చేవెళ్ల ప్రాంత ప్రజలకు రుణపడి ఉంటూ.. ఇంద్రారెడ్డి ఆశయాలను కొనసాగిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీరాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొత్త నరసింహారెడ్డి, ముదిగొండ శ్రీహరి యాదవ్, కోట్ల నరత్తం రెడ్డి, ముదిగొండ రవియాదవ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి, సుధాకర్ యాదవ్, జయవంత్, ఎంఏ.రావూఫ్, షేక్ మహబూబ్, మోర శ్రీనివాస్, మాణిక్ రెడ్డి, తిరుపతి రెడ్డి, అమ్డాపూర్ గ్రామ సర్పంచ్ కృష్ణ, కౌన్సిలర్లు పావని జగన్మోహన్ రెడ్డి, శ్రీలత రామచందర్, అప్పల సంధ్యా సురేష్ యాదవ్, గునుగుర్తి శిరీష కిరణ్, అరవింద్ రజాక, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నం, హయత్ నగర్ డిపోలకే పరిమితమైన బస్సులు

**ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ..డిపో ఎదుట కార్మికుల ఆందోళన**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్ :** రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న ఆర్టీసీ సమ్మె ప్రభావం ప్రజలపై తీవ్రంగా పడుతోంది. సమ్మె కారణంగా ఇబ్రహీంపట్నం, హయత్ నగర్ డిపోలకే ఆర్టీసీ బస్సులు పరిమితమవడంతో పలు ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యేకంగా ఉద్యోగులు, విద్యార్థులు, దినసరి ప్రయాణికులు గంటల తరబడి బస్సుల కోసం వేచి ఉండాల్సి వస్తోంది. కొన్ని రూట్లలో పూర్తిగా బస్సులు లేకపోవడంతో ప్రజలు ప్రత్యామ్నాయ రవాణా సదుపాయాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆటోలు, ప్రైవేట్ వాహనాలు అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా, సమ్మెకు మద్దతుగా ఆర్టీసీ కార్మికులు డిపో ఎదుట ఆందోళన చేపట్టారు. తమ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, డిమాండ్లను నెరవేర్చాలని నినాదాలు చేశారు. కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమ్మె కొనసాగితే రాబోయే రోజుల్లో ప్రజలకు మరింత ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, కార్మిక సంఘాల మధ్య చర్చలు జరిపి సమస్యను త్వరగా పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# నక్కలపల్లిలో ప్రోటోకాల్ ఉల్లంఘనపై రగడ

**ఎమ్మెల్యే కాలే యాదయ్య పై సర్పంచ్ తీవ్ర ఆగ్రహం**



**మొయినాబాద్ , విశాలభారతి:** నక్కలపల్లి గ్రామంలో అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమం చుట్టూ రాజకీయ వివాదం చెలరేగింది. ముందస్తు సమాచారం లేకుండా కార్యక్రమాన్ని నిర్వహించడంపై గ్రామ సర్పంచ్ మంగళారం యాదయ్య చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ఇంటర్నల్ సీసీ రోడ్లు, వీధి దీపాల ఏర్పాటుకు సంబంధించిన శంకుస్థాపన తేదీని ఎమ్మెల్యే ముందుగా నిర్ణయించి, కార్యక్రమానికి ముందు రోజు రాత్రి ఆలస్యంగా మాత్రమే సమాచారం అందించారని సర్పంచ్ తెలిపారు. తాము మధ్యాహ్నం 12:30 తర్వాత మాత్రమే అందుబాటులో ఉంటామని ముందుగానే పీఆర్ అధికారులు, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి తెలియజేసినా, ఉదయం 11 గంటల లోపే సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు లేకుండానే కార్యక్రమం నిర్వహించడం తీవ్ర అభ్యంతరకరమని అన్నారు. గ్రామానికి సంబంధించిన కీలక సమస్యలపై మంత్రులను కలిసే కార్యక్రమం ముందుగానే నిర్ణయించబడిందని, అందుకే తమ సమయాన్ని స్పష్టంగా తెలియజేశామని చెప్పారు. అయినప్పటికీ ఆ సమయాన్ని పట్టించుకోకుండా కార్యక్రమం నిర్వహించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్ మంగళారం యాదయ్య మాట్లాడుతూ, గ్రామ ప్రథమ పౌరుడైన సర్పంచ్‌ను పక్కనపెట్టి కార్యక్రమం నిర్వహించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 21 మరియు పంచాయతీ రాజ్ చట్టం ఉల్లంఘన అని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎస్సీ సర్పంచ్ పట్ల చూపిన వైఖరి అనాగరికమని తీవ్రంగా ఖండించారు.ఈ పనుల నిధులు మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి, కాంగ్రెస్ ఇంచార్జ్ భీమ్ భరత్ తదితరుల కృషితో వచ్చినవని, అయితే ఎమ్మెల్యే గతంలో గ్రామ అభివృద్ధికి సహకారం అందించలేదని విమర్శించారు. ఎమ్మెల్యే నిజంగా కాంగ్రెస్‌లో ఉన్నారా లేదా బీఆర్ఎస్‌కు మద్దతుగా వ్యవహరిస్తున్నారా అనే విషయంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.గ్రామ ప్రజాప్రతినిధులను అవమానించే విధంగా వ్యవహరించిన ఎమ్మెల్యే వెంటనే క్షమాపణలు చెప్పాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే ఎమ్మెల్యేను నియోజకవర్గంలో తిరగనివ్వరని హెచ్చరికలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నిరంజన్ గౌడ్, వార్డు సభ్యులు శ్రావంతి, స్వాతి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో బొడిగె ఆనంద్ గౌడ్ మృతి

- మాజీ సర్పంచ్ అశోక్ గౌడ్ కుమారుడి అకాల మరణం
- కుటుంబాన్ని పరామర్శించిన ప్రజాప్రతినిధులు



**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్ :** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్ మెట్ గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామ మాజీ సర్పంచ్ బొడిగె అశోక్ గౌడ్ కుమారుడు బొడిగె ఆనంద్ గౌడ్ గుండెపోటుతో మృతి చెందడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.ఆనంద్ గౌడ్ అకస్మాత్తుగా గుండెపోటుకు గురై మృతి చెందడం కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్థులను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.మరణ వార్త తెలిసిన వెంటనే స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు అక్కడికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడికి నివాళులు అర్పించి, కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ధైర్యం కలగాలని స్థానికులు ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో కొత్తపల్లి జైపాల్ రెడ్డి, బుర్ర మహేందర్ గౌడ్, మందుగుల శ్రీశైలం గౌడ్, జంగయ్య గౌడ్ తో పాటు స్థానిక ప్రజాప్రతిని తదితరులు పాల్గొన్నారు .

# 24 గంటల మంచి నీటి సరఫరా ఇవ్వడానికి సన్నాహాలు

**జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మక్కాన్ సింగ్ రాజ్ రాఠాగూర్**



**విశాలభారతి, గోదావరిఖని:**

త్వరలో నగరమంతా 24 గంటల మంచి నీటి సరఫరా ఇవ్వడానికి సన్నాహాలు చేస్తున్నట్లు రామగుండం శాసన సభ్యులు ఎం. ఎస్. రాజ్ ఠాకూర్ వెల్లడించారు. వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా మేయర్ మహంకాళి స్వామితో కలిసి 59 వ డివిజన్ అశోక్ నగర్ , గాంధీ నగర్ , మార్కండేయ కాలనీ ప్రాంతాలలో బుధవారం పర్యటించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా రామగుండం లో రోజు విడిచి రోజు మాత్రమే సరఫరా జరుగుతుండగా తాము అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి రోజూ ఇస్తున్నామని అన్నారు . నిండు వేసవిలోనూ నీటి కొరత రాకుండా సరఫరా జరుగుతున్నదని అన్నారు. ప్రతి ఇంటికి నిరంతరాయంగా నీటి సరఫరా చేయడానికి ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. నీటి పైప్ లైన్ లలో లీకేజీలను యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తు చేయాలని సంబందిత సిబ్బందిని ఆదేశించారు. డ్రైనేజీ ల వద్ద మంచి నీటి సరఫరా పైప్ లైన్ లలో లీకేజీలు ఏర్పడినప్పుడు మరింత అప్రమత్తంగా ఉండి వెంటనే అరికట్టాలని అన్నారు. ఎట్టి పరిస్థితులలోనూ కలుషిత నీరు పైప్ లైన్లలోకి చేరకుండా నివారించాలని అన్నారు. తన పర్యటనలో భాగంగా మార్కండేయ కాలనీ లోని ఒక విద్యా సంస్థ వద్ద చుట్టు ప్రక్కల వారు చెత్త వేయయడాన్ని గమనించి అలాంటి చోట్లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సదరు విద్యా సంస్థ నిర్వాహకులకు అవగాహన కల్పించి పరిసరాలన్నీ దత్తత తీసుకొని రోజూ సానిటేషన్ వారే చేసేలా ప్రేరేపించాలని అన్నారు. నగరం శుభ్రంగా, సుందరంగా ఉండాలంటే ప్రజలు , వివిధ వ్యాపార సంస్థల భాగస్వామ్యం తప్పనిసరని అన్నారు. స్పెషల్ డ్రైవ్ చేపట్టి కాలువల్లో పూడిక తీయించడానికి మేయర్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. నగర మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ ఏండ్ల తరబడి పూడిక తొలగించకపోవడంతో చుట్టు ప్రక్కల దోమలు , ఈగలు , పందులు పెరుగుతూ అనారోగ్యకర పరిస్థితులు నెలకొని వ్యాధులు విజృంభిస్తున్న విషయం గమనించాలని అన్నారు. కాలువల్లో పూడిక తీత ఒక మహా యజ్ఞం లా చేపడుతున్నామని అన్నారు. ఇక ముందు కాలువలో చెత్త వేసే వారి ఫోటోలు తీసి నగర పాలక సంస్థ సిబ్బందికి ఇస్తే సదరు వ్యక్తులకు జరిమానా విధిస్తామని అన్నారు. మెప్మా ఆర్ పి లు , వార్డు అధికారులు , వార్డు అసిస్టెంట్ లు ఎఏ మేరకు ఇంటింటా అవగాహన కల్పించాలని అన్నారు. కాగా ఈ సందర్భంగా రోడ్డు మీదకు వచ్చేలా ఇంటి ముందు కట్టిన మెట్లు , గద్దెలు తొలగించారు. పాత విధ్యుత్ స్తంభాలు రోడ్డుకు అడ్డు లేకుండా మరో చోట కొత్త స్తంభాలు వేయాలని ట్రాన్స్ అధికారులకు మేయర్ ఆదేశాలు జారీ చేశారు. కొత్త పైప్ లైన్లు వేసి ఇంటింటా నల్లా కనెక్షన్ వెంటనే ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య స్థానిక కార్పొరేటర్ బాలసాని తిరుపతి తో పాటు కార్పొరేటర్లు వడ్లూరి రవి, దాసరి సాంబ మూర్తి , ధూళికట్ట సతీష్ , తాళ్ళపెళ్ళి యుగంధర్, చిదురాల నాగరాజు నాయకులు కజంపురం రాజేందర్ , మారెల్లి రాజిరెడ్డి , నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , ఎస్ ఇ గురువీర , ఇ ఇ రామన్ , టి పి ఎస్ నవీన్ , ఎ ఇ మీర్ , సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు




**తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి**

**నిజామాబాద్, విశాలభారతి:**

అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు జారీ అయ్యేలా తెలంగాణ మీడియా అకాడమీ చిత్తశుద్ధితో కృషి చేస్తోందని అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఎవరికీ అన్యాయం జరుగకుండా చూస్తామని భరోసా కల్పించారు. నిజామాబాద్ నగర ప్రెస్ క్లబ్ జర్నలిస్టులకు వెల్ నెస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత ఫ్యామిలీ హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. న్యూ అంబేద్కర్ భవన్ లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి, జర్నలిస్టులకు లాంఛనంగా కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర అక్రిడిటేషన్ కమిటీ నాలుగవ విడత సమావేశం గురువారం జరగనుందని తెలిపారు. జర్నలిస్టు సంఘాలు, పాత్రికేయుల అభ్యర్థనల మేరకు అక్రిడిటేషన్ల జారీ కోసం ఉద్దేశించిన 252 జీఓలో అవసరమైన సవరణలు ప్రభుత్వానికి ప్రతిపాదిస్తామని అన్నారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియలో ఎవరూ ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని, అర్హులైన వారందరికీ తప్పనిసరిగా అక్రిడిటేషన్లు జారీ అవుతాయని అన్నారు. స్పోర్ట్స్ జర్నలిస్ట్ లు, కార్టూనిస్టులు, ఫిలిం, కల్చరల్ జర్నలిస్టులకు కూడా కార్డులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జర్నలిస్టులందరికీ పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా మీడియా అకాడమీ చర్యలు తీసుకుందని అన్నారు. సర్క్యులేషన్ ప్రాతిపదికన కార్డులను రాష్ట్ర, జిల్లా స్థాయిలో జారీ చేస్తారని చెప్పారు. కేబుల్ ఛానల్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు జారీ చేసే విధి విధానాల కోసం సబ్ కమిటీ వేశామని, కమిటీ నివేదిక మేరకు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. జర్నలిజంతో సంబంధం లేని వారికి మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రిడిటేషన్లు జారీ కాకుండా చూడాలన్నారు. దేశంలోనే మరెక్కడా లేనివిధంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక సంఖ్యలో అక్రిడిటేషన్ కార్డులు ఉన్నాయని, ఇదివరకటి తరహాలోనే ఈసారి కూడా కార్డులు జారీ చేయబడతాయని అన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల పంపిణీ విషయమై రెండు మూడు రోజుల్లోనే రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రితో భేటీ ఉందని, ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని నమ్మకం ఉందన్నారు. కాగా, జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ముందుకు వచ్చి హెల్త్ కార్డులు అందించిన వెల్ నెస్ ఆసుపత్రి యాజమాన్యాన్ని చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ రాష్ట్ర కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ కవితా రెడ్డి, డీపీఆర్ఓ పద్మశ్రీ, వెల్ నెస్ ఆసుపత్రి యాజమాన్య ప్రతినిధులు అసద్ ఖాన్, ముబీన్ పటేల్, భార్గవ్, ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, సుభాష్, కార్యవర్గ సభ్యులు, జర్నలిస్టు సంఘాల నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలి

- ఇంజనీరింగ్, డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలి
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్



**మేడిపల్లి, విశాలభారతి:**

బుధవారం నాడు ఆర్టీసీ కార్మికుల రాష్ట్ర వ్యాప్త సమ్మె సందర్భంగా ఉప్పల్ డిపో వద్ద ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ సంఘీభావం తెలియజేయడం జరిగింది. పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ....తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని చేస్తున్న సమ్మెకు ఏఐఎస్ఎఫ్ మద్దతు ఇస్తుందని, ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని, ఈరోజు నుండి రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు సమ్మె చేయడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితం అయ్యాయని, ఈరోజు నుండి ఆర్టీసీ కార్మికుల సమ్మె ప్రారంభం వల్ల ఇంజనీరింగ్ ,డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు బస్సులు లేక చాలా ఇబ్బందులు పడి సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోలేకపోయారని, మహిళలకు ఉచిత బస్ నేపథ్యంలో ప్రతి విద్యార్థిని ఆర్టీసీ బస్సులోనే ప్రయాణిస్తు కళాశాలలకు వస్తున్నారని, అదేవిధంగా విద్యార్థులు ఆర్టీసీ బస్ పాస్ ల ద్వారా మారుమూల ప్రాంతాలు ,పల్లెటూరుల నుండి కళాశాలలకు వస్తున్నారని, అధికంగా విద్యార్థులు ఆర్టీసీ బస్సులు ఉపయోగిస్తున్నారని, అలాంటప్పుడు పరీక్షల సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతారని, రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత విద్యా శాఖ, జేఎన్టీయూ అధికారులు వెంటనే విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా సెమిస్టర్ పరీక్షలను సమ్మె విరమణ అయ్యే వరకు తాత్కాలికంగా వాయిదా వేయాలని, విద్యార్థుల భవిష్యత్ కి ఇబ్బంది లేకుండా అధికారులు ఆలోచించాలని,అదేవిధంగా రేపటి నుండి పాఠశాలలకు కూడా సెలవులు నేపథ్యంలో సంక్షేమ హాస్టల్, గురుకులాల్లో ఉండే విద్యార్థులు ఇంటికి వెళ్లడానికి కూడా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉంటుందని, ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల 32 న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ,గతంలో రేవంత్ రెడ్డి ప్రతిపక్ష హోదాలో ఉన్నప్పుడు తమ అధికారంలోకి వస్తే ఆర్టీసీ కార్మికుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని, ఆర్టీసీలో గుర్తింపు సంఘాల ఎన్నికల నిర్వహిస్తామని ఇంకా అనేక హామీలు ఇచ్చి ఇప్పటికీ అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు కావస్తా ఉన్న కమిటీలు వేసి కాలయాపన చేస్తున్నారు తప్ప ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించడం పూర్తిగా విఫలం చెందారని ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్య ధోరణిని ఖండిస్తూ ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తున్నారని వెంటనే ప్రభుత్వం వారి డిమాండ్లను పరిష్కరించాలని పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

# ఆర్టీసీ కార్మికులకు నాయకుల మద్దతు



**సికింద్రాబాద్, విశాలభారతి :** ఆర్టీసీ కార్మికుల్ని ప్రభుత్వం లో విలీనం చేయాలని, ఆర్టీసీలో యూనియన్లను పునరుద్ధరించాలని, కార్మికులకు రావలసిన రెండు పీఆర్సీలను వెంటనే విడుదల చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. తదితర డిమాండ్లతో ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు మద్దతుగా జేబీఎస్ వద్ద జరిగిన ధర్నాలో ఏఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి యం. నర్సింహా, మేడ్చల్ జిల్లా కార్యదర్శి పి శ్రీనివాసులు, హైదరాబాద్ జిల్లా ఆటో యూనియన్ నాయకులు ఎండి ఉమర్ ఖాన్, ఆర్ కృష్ణమూర్తి పాల్గొని తమ మద్దతు తెలిపారు.

# జగన్‌తో చిర్రా రవీందర్ యాదవ్ భేటీ

**ఫోటో ఫ్రేమ్ బహూకరించిన చిర్రా..పోటీకి సిద్ధంగా ఉండాలని జగన్ సూచన**





**శేరిలింగంపల్లి, విశాలభారతి:** ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని బీఆర్ఎస్ సీనియర్ నేత,శేరిలింగంపల్లి ఉద్యమ నేత చిర్రా రవీందర్ యాదవ్ పులివెందులలో మర్యాదపూర్వకంగా కలిశారు.వైఎస్ రాజశేఖర్ రెడ్డితో కూడిన ఫోటో ఫ్రేమ్‌ను జగన్‌కు అందించగా,'చాలా బాగుంది'అని జగన్ కితాబిచ్చారు. శేరిలింగంపల్లిలో బీఆర్ఎస్ కార్యక్రమాల నిర్వహణ,ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలపై జగన్ ప్రశంసించారు.వచ్చే ఎన్నికల్లో శేరిలింగంపల్లి నుంచి టికెట్ ఆశిస్తున్న చిర్రాకు 'పోటీకి సిద్ధంగా ఉండండి,నా మద్దతు ఉంటుంది'అని జగన్ సూచించారు.అనంతరం చిర్రా రవీందర్ మాట్లాడుతూ "రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రజలు మార్పు కోరుకుంటున్నారు.తెలంగాణలో కేసీఆర్,ఏపీలో జగన్ దే అధికారం"అని పేర్కొన్నారు.

# స్విమ్మింగ్ పూల్‌లో పడి చిన్నారి మృతి

**చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయిన 3½ ఏళ్ల బాలుడు**



**రాజేంద్రనగర్, విశాలభారతి:** నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. స్విమ్మింగ్ పూల్‌లో ప్రమాదవశాత్తు పడి తీవ్రంగా గాయపడిన మూడు సంవత్సరాల చిన్నారి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. పోలీసుల వివరాల ప్రకారం, నార్సింగి గ్రామంలోని రాజపుష్ప ప్రోవిన్షియా అపార్ట్‌మెంట్స్‌లో నివసిస్తున్న వ్యాపారి మల్లపు దినేష్ రెడ్డి (38) ఈ ఘటనపై ఫిర్యాదు చేశారు. ఈ నెల 15వ తేదీన వ్యాపార పనుల నిమిత్తం ఆయన విశాఖపట్నానికి వెళ్లగా, 16వ తేదీ ఉదయం సుమారు 11 గంటల సమయంలో ఆయన భార్య మానస ఫోన్ చేసి వారి కుమారుడు ఎం. రిషాన్ రెడ్డి (3½) ప్రమాదవశాత్తు అపార్ట్‌మెంట్ క్లబ్ హౌస్ పరిధిలోని స్విమ్మింగ్ పూల్‌లో పడిపోయినట్లు తెలిపింది. ఈ సంఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురై వెంటనే బాలుడిని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ అత్యవసర చికిత్స అందించినప్పటికీ బాలుడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో, మరింత మెరుగైన వైద్యం కోసం 17వ తేదీన రైన్‌బో ఆసుపత్రికి తరలించారు. చికిత్స కొనసాగుతున్నప్పటికీ బాలుడి ఆరోగ్యం క్రమంగా క్షీణించింది. వైద్యులు పరిస్థితి ఆశాజనకంగా లేదని తెలపడంతో కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. చివరకు 22వ తేదీ ఉదయం ఇంటికి తీసుకెళ్తున్న సమయంలో బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనపై నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అపార్ట్‌మెంట్‌లో భద్రతా లోపాలున్నాయా? స్విమ్మింగ్ పూల్ వద్ద తగిన జాగ్రత్తలు తీసుకున్నారా? అనే అంశాలపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. చిన్నారి మృతి స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

# కొండాపూర్‌లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

**ప్రజా పాలన కార్యాచరణలో భాగంగా 40 మంది సిబ్బందితో పారిశుధ్య పనులు**



**శేరిలింగంపల్లి, విశాలభారతి:** ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కొండాపూర్ మార్తాండ్ నగర్‌లో శుక్రవారం జీహెచ్ఎంసీ స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించింది. డిప్యూటీ కమిషనర్ సేవా ఈస్లావత్, మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్ అధికారులు, సిబ్బందితో కలిసి పాల్గొన్నారు.40 మంది శానిటేషన్ సిబ్బంది వీధుల్లో చెత్త,రోడ్లపై మట్టి,సీ&డీ వేస్ట్‌ను తొలగించారు. ఈవేస్ట్ సేకరణకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.డోర్ టుడోర్ చెత్త సేకరణకు ప్రజలు సహకరించాలి. రోడ్లపై చెత్త వేయొద్దు.క్లీన్ అండ్ గ్రీన్ తెలంగాణే లక్ష్యం"అని హమీద్ పటేల్ పేర్కొన్నారు.కార్యక్రమంలో డీఈ ఆనంద్, ఎస్ఆర్పీ రాజయ్య, ఎస్ఎఫ్ఏ నందు,స్థానిక నేతలు మొహ్మద్ అలీ,శ్రీనివాస్ చౌదరి,తిరుపతి పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# సీ.ఎం. రిలీఫ్ ఫండ్‌తో పేదలకు అండ

- చిన్నారి చికిత్సకు రూ.6 లక్షల సహాయం.. ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ మండలం :** పేదల ఆరోగ్య పరిరక్షణలో సీ.ఎం. రిలీఫ్ ఫండ్ కీలక పాత్ర పోషిస్తోందని ఎల్.బి.నగర్ నియోజకవర్గం శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. మన్సురాబాద్ డివిజన్ పరిధిలోని అనిత నగర్ కాలనీలో నివసిస్తున్న సంతోష్ ఆనంద్ కుటుంబానికి చెందిన చిన్నారి చికిత్స కోసం రూ.6 లక్షల ఎల్.ఓ.సీ మంజూరు చేయడం దీనికి ఉదాహరణగా నిలిచింది. సంతోష్ ఆనంద్ 18 నెలల కుమార్తె శ్రీసిద్ది పుట్టుకతోనే చెవి వినికిడి సమస్యతో బాధపడుతోంది. కుటుంబ ఆర్థిక పరిస్థితులు బలహీనంగా ఉండటంతో చికిత్స ఖర్చులు భరించడం కష్టమవడంతో వారు స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని సంప్రదించారు.ఈ విషయంపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే, అవసరమైన వైద్య ఖర్చుల వివరాలను సేకరించి ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయించారు.దానికి స్పందించిన ప్రభుత్వం రూ.6,00,000 విలువైన ఎల్.ఓ.సీ చెక్కును మంజూరు చేసింది. ఈ సందర్భంగా దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ... పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో సీ.ఎం. సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. ఈ పథకం అనేక కుటుంబాలకు వరంగా మారిందని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నవారికి ప్రాణాధారంగా నిలుస్తోందని తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీఆర్ఎస్ నాయకులు సామ బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# మిరాకిల్ మైండ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సక్సెస్ ఫెస్ట్ (రిజల్ట్ డే) వేడుకలు

- రిజల్ట్ డే సందర్భంగా విద్యార్థుల ప్రతిభకు అభినందనలు
- వేదిక్ మాథ్స్, అబాకస్, ఏఐ టెక్నాలజీతో ప్రత్యేక బోధన
- విద్యార్థుల ఫలితాలపై అతిథుల ప్రశంసలు
- ఉపాధ్యాయుల కృషికి నిర్వాహకుల అభినందనలు



**సత్తుపల్లి, విశాలభారతి :**

సత్తుపల్లి పట్టణం సిద్ధారం రోడ్‌లోని మిరాకిల్ మైండ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సక్సెస్ ఫెస్ట్ (రిజల్ట్ డే) వేడుకలు పాఠశాల ప్రిన్సిపాల్ మొండ్రు రత్నాకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథులను సాదరంగా ఆహ్వానిస్తూ, విద్యార్థుల ప్రతిభను వెలుగులోకి తీసుకువచ్చే ఈ వేడుకలు పాఠశాల అభివృద్ధికి ప్రతిబింబంగా నిలుస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి నక్క రాజేశ్వరరావు, న్యూ స్టార్ హాస్పిటల్ డాక్టర్ రామాల సురేష్ హాజరయ్యారు. జూన్ నెల ప్రారంభం నుంచి ఏప్రిల్ నెల చివరి వరకు విద్యార్థులు సాధించిన అద్భుత ఫలితాలు ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల సహకారం, విద్యార్థుల పట్టుదలకు నిదర్శనమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. అధునాతన వేదిక్ మాథ్స్, అబాకస్, ఇన్నోవేటివ్ మెథడ్స్, ఏఐ టెక్నాలజీ, ఎల్ఈడి డిజిటల్ క్లాసెస్ ద్వారా విద్యార్థులను సమగ్రంగా తీర్చిదిద్దుతున్నామని వివరించారు. భవిష్యత్తులోనూ ఇదే ఉత్సాహంతో మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు పాఠశాల కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.మండల విద్యాశాఖ అధికారి నక్క రాజేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కూడా నగర స్థాయి విద్యను అందిస్తూ విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దుతున్న ఈ పాఠశాల ప్రత్యేక స్థానం సంపాదించుకుందని అన్నారు. విద్యార్థులలో నైపుణ్యాభివృద్ధికి అవసరమైన ఆధునిక పద్ధతులను అమలు చేయడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా వ్యక్తిత్వ వికాసం, సృజనాత్మకత, సాంకేతిక పరిజ్ఞానం వైపు విద్యార్థులను దారి చూపించడం కాలానుగుణమైన నిర్ణయమని అభిప్రాయపడ్డారు.విద్యార్థిని విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించే విధంగా సత్తుపల్లి పట్టణంలోని మిరాకిల్ మైండ్స్ పాఠశాల ఉపాధ్యాయులు ఉత్తమమైన విద్యా బోధనల ద్వారా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారని అభినందించారు.న్యూ స్టార్ హాస్పిటల్ డాక్టర్ రామాల సురేష్ మాట్లాడుతూ విద్య అనేది కేవలం పరీక్షల ఫలితాలతో ముగిసేది కాదని, జీవితంలో విలువలను నేర్పించే ప్రక్రియ అని తెలిపారు. మిరాకిల్ మైండ్స్ పాఠశాలలో అమలు చేస్తున్న సమగ్ర విద్యా విధానం విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. చిన్న వయస్సులోనే టెక్నాలజీ, లాజికల్ థింకింగ్, మానసిక అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం భవిష్యత్ పోటీతత్వ ప్రపంచంలో వారికి బలమైన పునాది అవుతుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ గీత, డీన్ వాణి, ఏవో మురళి, ఇంచార్జ్ మహేష్, టీచర్లు పాల్గొన్నారు.

## పైవేట్ వ్యక్తుల ఒత్తిడి. దానికి తోడైన పోలీస్ అధికారి పాత్ర?

**లక్ష్మి ప్రియా నగర్‌లో మాజీ అధ్యక్షుడి ఆత్మహత్య..న్యాయం కోసం స్థానికుల డిమాండ్**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** హయత్ నగర్ డివిజన్ పరిధిలోని లక్ష్మి ప్రియా నగర్ కాలనీలో చోటు చేసుకున్న ఆత్మహత్య ఘటన పలు అనుమానాలకు తావిస్తోంది. కాలనీ మాజీ అధ్యక్షుడు మధు ఆత్మహత్యకు పాల్పడటం వెనుక ప్రైవేట్ వ్యక్తుల ఒత్తిడి, అలాగే ఒక పోలీస్ అధికారిది కూడా పాత్ర ఉందా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.స్థానిక సమాచారం ప్రకారం.. కాలనీకి చెందిన బోడ యాదగిరి గౌడ్ మరియు ఆయన సోదరుడు రమణ గౌడ్ ఆర్థిక లావాదేవీల విషయంలో మధుపై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వేధింపుల కారణంగా మధు తీవ్ర మనస్తాపానికి గురై, వారి పేర్లు ప్రస్తావిస్తూ సూసైడ్ నోట్ రాసి ఉరివేసుకున్నట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఇదే సమయంలో హయత్ నగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఒక పోలీస్ అధికారి కూడా ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుని మధుపై ఒత్తిడి తెచ్చాడనే ఆరోపణలు కేసును మరింత సంచలనంగా మార్చాయి. ప్రజలను రక్షించాల్సిన పోలీసులే ఇలాంటి ఆరోపణలకు గురవడం ఆందోళన కలిగిస్తోంది. ఘటన అనంతరం మధు మృతదేహాన్ని యాదగిరి గౌడ్ ఇంటి వద్ద ఉంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు గజ్జి భాస్కర్ యాదవ్, స్థానిక నాయకులు బోడ శ్రవణ్, బిఆర్ఎస్ నాయకుడు ద్యాగాల రాకేష్ తదితరులు నిరసన వ్యక్తం చేశారు. కాలనీ వాసులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలో పోలీసులపైనా ఆరోపణలు రావడంతో విచారణ పారదర్శకతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.స్వతంత్ర దర్యాప్తు ద్వారా నిజానిజాలు వెలికితీయాలని ప్రజలు కోరుతున్నారు. మధు కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని స్థానికులు స్పష్టం చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి అన్ని కోణాల్లో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవడం అధికార యంత్రాంగానికి కీలక పరీక్షగా మారింది.

## సినీ నటుడు ప్రకాష్‌రాజ్ వ్యాఖ్యలపై ఆగ్రహం

- భద్రాద్రి హిందూ ఐక్యవేదిక హెచ్చరిక
- రాముడిని, రామాయణాన్ని కించపరిస్తేహిందువులు సహించరు

**బూర్గంపాడు, విశాలభారతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో హిందూ ఐక్యవేదిక, విశ్వహిందూ పరిషత్ మందిర అర్చక పురోహిత్ విభాగం, బిజెపి నాయకులతో పాటు ఇతర హిందూ సంఘాలు సినీనటుడు ప్రకాష్‌రాజ్ చేసిన హిందూ ధర్మం, రామాయణం విషయాలపై వివాదాస్పద వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించాయి. ఇటీవల కేరళలో జరిగిన సాహిత్యోత్సవంలో ప్రకాష్‌రాజ్ రాముడిని ఉత్తర భారతీయుడు, రావణుడిని దక్షిణాది గిరిజనుడు అని, రాముడు పండ్లు దొంగిలించాడని చెప్పడం ద్వారా హిందూ భక్తుల మనోభావాలను దెబ్బతీశారని నాయకులు ఆరోపించారు . ఈ నేపథ్యంలో బుధవారం జరిగిన సమావేశంలో నాయకులు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. విశ్వహిందూ పరిషత్ మందిర అర్చక పురోహిత్ తెలంగాణా రాష్ట్ర సహ ప్రముఖ ఓరుగంటి సురేష్ కుమార్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై కోపం ఉంటే అతనిపై చూపించాలి కానీ, ఆ ముసుగులో హిందూ సంఘాలు, ధర్మాన్ని జోలికి వస్తే హిందువులు ఎవరూ ఊరుకోరని స్పష్టం చేశారు. ప్రకాష్‌రాజ్ నాస్తికవాద ముసుగులో హిందూ ధర్మాన్ని కించపరుస్తున్నారని, తన తల్లి మరణానంతరం ఆమె ఇష్టానుసారం క్రైస్తవ మార్గంలో అంత్యక్రియలు చేసి తల్లి ఆత్మను తృప్తి పరిచిన వాడు హిందువుల మనస్సును గుర్తించి మాట్లాడాలని సూచించారు. ఇటువంటి వ్యాఖ్యలు సహించలేమని, హిందూ ఐక్యతను కాపాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.బిజెపి నాయకుడు, బిఎంఎస్ బిజ్జం అశోక్ రెడ్డి తన ప్రసంగంలో ప్రకాష్‌రాజ్ అనుచిత వాక్యాలను ఖండిస్తూ, హిందూ ధర్మంపై , బురద చల్లుతున్నారని, భారతదేశం అంతా ఇది చూస్తోందని అన్నారు. ప్రకాష్‌రాజ్ సినిమాలు అన్నీ హిందూ సంప్రదాయాలు, దేవాలయాలపై ఆధారపడి నటించి లాభాలు పొందాడని, ఇప్పుడు బొట్లు పెట్టుకుని దేవాలయాలకు వెళ్లి అవమానిస్తున్నాడని ఆరోపించారు . అతను క్షమాపణ చెప్పకపోతే అతని సినిమాలన్నీ బ్యాన్ చేస్తామని, నిర్మాతలు వేషాలు ఇస్తే వారిని కూడా శిక్షిస్తామని, ప్రతి పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేస్తామని హెచ్చరిక జారీ చేశారు. హిందువులు ఐక్యంగా ఉండకపోతే ధర్మంపై దాడులు కొనసాగుతాయని హెచ్చరించారు.హిందూ ఐక్యవేదిక సభ్యులు భాస్కర్, కామేశ్వరరావుతో పాటు ఇతర నాయకులు మాట్లాడుతూ, ప్రకాష్‌రాజ్ వంటి వారు సెలబ్రిటీల స్థాయిలో మత విభేదాలు కలిగించే మాటలు చెప్పడం సమాజానికి హాని కలిగిస్తుందని అన్నారు. దేశవ్యాప్తంగా టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాష్ రెడ్డి సహా పలువురు రూ.100 కోట్ల పరువు నష్టం దావాలు వేశారని, 295ఎ సెక్షన్ కింద కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు . జిల్లాలో ఇలాంటి వ్యాఖ్యలు సహించకుండా ఉద్యమం చేపడతామని, హిందూ సంప్రదాయాలను రక్షించాలని ప్రజలకు పిలుపు నిచ్చారు.



## కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో క్షేత్ర దినోత్సవం

- గాదే నర్సిరెడ్డి వరిపొలంను పరిశీలించిన శాస్త్రవేత్తలు
- రాంగోపాల్ వర్మ అదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం
- భరత్ కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం
- వ్యవసాయ శాఖ అధికారి ఏడీఏ తాతారావు



**బూర్గంపాడు, విశాలభారతి:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సోంపల్లి పంచాయతీ పరిధిలో గల కిన్నెరసాని పరివాహక ప్రాంతం ఆదర్శ రైతు గాదేనర్సిరెడ్డి పొలంలో పాత పద్ధతులను వీడి నూతన పద్ధతులను అవలంబిస్తూ డ్రోన్ ద్వారా కూడా వ్యవసాయం సాగు చేయవచ్చు అని నిరూపించారు కృషి విజ్ఞాన కేంద్రం కొత్తగూడెం. ఈ సందర్భంగా ఆ యూనిట్ హెడ్ టి.భరత్ మాట్లాడుతూ డ్రోన్ ప్రయోగానికి ఒక ఎకరం సాగు భూమి ఇచ్చి సహకరించిన ఆదర్శరైతు గాదె నర్సిరెడ్డిని అభినందించారు. డ్రోన్ వినియోగం ద్వారా అధిక ఖర్చులను నిర్మూలించవచ్చని డ్రోన్ వినియోగంతో పంట సంరక్షణకు కావాల్సిన ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ పిచ్చుకారి సులభతరంతో పాటు కూలీల బెడధ నుంచి విముక్తి పొందవచ్చని అన్నారు. డ్రోన్ వ్యవసాయ పద్ధతులను పరిశీలించడానికి అదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం నుంచి విచ్చేసిన రామ్ గోపాల్ వర్మకు స్వాగతం పలికారు. పంటలను పరిశీలించిన రాంగోపాల్ వర్మ డ్రోన్ పనితీరు పై ఆదర్శ రైతు గాదే నర్సిరెడ్డి అభిప్రాయాన్ని తీసుకొని పంట నాణ్యతను పరిశీలించారు. పంట దిగుబడి అంచనా 40 కింటాలు వస్తుందని ఆదర్శ రైతు ధీమా వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఇంతటి ప్రోత్సాహాన్ని కల్పించిన కెవికె కృషి విజ్ఞాన కేంద్రానికి మరియు గత కలెక్టర్ జితేష్ వి పాటిల్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. డ్రోన్ వినియోగ పద్ధతి ద్వారా 10 వేల రూపాయల ఖర్చు ఆదావుతుందని ఆనందం వ్యక్తం చేశారు. రైతులు పాత పద్ధతులను వేడి నూతన వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని ఆదర్శ రైతు గాదె నర్సిరెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టీం, అదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారి ఏడిఏ తాతారావు మణుగూరు సోంపల్లి గ్రామ రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శంషాబాద్‌లో రూ. 90 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి రక్షణ



**9.05 ఎకరాల్లో ఆక్రమణల తొలగింపు... హైడ్రా ఫెన్సింగ్ ఏర్పాటు**

**రాజేంద్రనగర్, విశాలభారతి:**

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలో ప్రభుత్వానికి చెందిన విలువైన భూమిని హైడ్రా అధికారులు బుధవారం రక్షించారు. సుమారు 9.05 ఎకరాల ఈ భూమి మార్కెట్ విలువ రూ. 90 కోట్లకు పైగా ఉంటుందని రెవెన్యూ అధికారులు వెల్లడించారు. ఇటీవల అందిన ఫిర్యాదుల ఆధారంగా రంగంలోకి దిగిన హైడ్రా బృందం ఆక్రమణలను తొలగించి భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుంది. సర్వే నంబర్ 626/2లో మొత్తం 176.05 ఎకరాల ప్రభుత్వ భూమి రికార్డుల ప్రకారం నమోదు అయి ఉంది. ఇందులో 166 ఎకరాలను అటవీ అభివృద్ధి సంస్థకు ప్రభుత్వం కేటాయించింది. మిగిలిన 9.05 ఎకరాల భూమి విషయమై వివాదం కొనసాగుతోంది. ఖస్రా పహాణీ వంటి పాత గ్రామ రికార్డుల ప్రకారం కూడా ఈ మొత్తం భూమి ప్రభుత్వానికి చెందినదిగా నమోదు అయి ఉంది. అయితే కొందరు వ్యక్తులు ఈ భూమిని సీఎస్14గా, అంటే నిజాం కాలానికి చెందిన భూమిగా పేర్కొంటూ తమ హక్కులను వాదిస్తున్నారు. ఈ భూవివాదం ప్రస్తుతం హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో తుది తీర్పు వెలువడే వరకు భూమి స్వరూపాన్ని మార్చరాదని, ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని కోర్టు స్టేటస్‌కో ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ, కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా తజమ్ముల్ మొయినుద్దీన్ ఖాన్ అనే వ్యక్తి ఈ భూమిని సమతల పరచి లేఔట్‌గా అభివృద్ధి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుల మేరకు రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం, శంషాబాద్ మున్సిపల్ అధికారుల ఆదేశాలతో రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. ఈ తనిఖీలలో సదరు వ్యక్తి ప్రీకాస్ట్ గోడలతో భూమిని చుట్టుముట్టి ఆక్రమించినట్లు గుర్తించారు. అంతేకాకుండా ఆ భూమిలో కొన్ని ఇంటి స్థలాలను విక్రయించినట్లు కూడా అధికారులు గుర్తించారు. భూ ఆక్రమణ చట్టం 1905 ప్రకారం ఆక్రమణలను తొలగించాలని అధికారులిచ్చిన నోటీసులను పట్టించుకోకపోవడంతో, రెవెన్యూ మరియు మున్సిపల్ అధికారులు సంయుక్తంగా హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన హైడ్రా బృందం బుధవారం ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి 9.05 ఎకరాల భూమిలోని అన్ని ఆక్రమణలను తొలగించింది. ఆ తర్వాత భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ఇది ప్రభుత్వ భూమి అని స్పష్టంగా సూచించే బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. ఈ చర్యల ద్వారా భూమి స్వరూపాన్ని కాపాడడమే కాకుండా, భవిష్యత్తులో మళ్లీ ఆక్రమణలు జరగకుండా నిరోధించడమే లక్ష్యంగా అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం రెవెన్యూ మరియు మున్సిపల్ అధికారుల సమక్షంలో సజావుగా పూర్తయింది.

## పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 333వ ఆరాధన మహోత్సవాలు



**ముషీరాబాద్,విశాలభారతి:** పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 333వ ఆరాధన జయంతి మహోత్సవాలను ఘనంగా జరుపుకుందామని బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి కోరారు. ఈనెల 26న జరిగే ఆరాధన మహోత్సవాన్ని గ్రామ మండల జిల్లా రాష్ట్ర వ్యాప్తంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ట్యాంక్ బండ్ పై ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు మంత్రులు కేంద్ర మంత్రులు ప్రతిపక్ష నాయకులు ఎమ్మెల్యేలు మహోత్సవ కార్యక్రమం లో పాల్గొంటున్నందున ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి తన కాలజ్ఞానంలో భవిష్యత్తులో జరగబోయే వింతలు మార్పులు పకృతి వైపరీత్యాలు సాంకేతిక పరిజ్ఞానం ముందే వివరించారని చెప్పారు.

## నాదెండ్ల మృతి పట్ల సంతాపం తెలిపిన నేతలు



**సికింద్రాబాద్,విశాలభారతి :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు మరణం పట్ల బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రవి ప్రసాద్ గౌడ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## పాల్వంచలో పట్టపగలే చోరీ



**పాల్వంచ ,విశాలభారతి:** పట్టణంలోని వెంకటేశ్వర హిల్స్ కాలనీలో పట్టపగలే జరిగిన చోరీ ఘటన స్థానికులను భయాందోళనలకు గురి చేసింది. వనమా కాలనికి చెందిన వ్యక్తులుగా అనుమానిస్తున్న దుండగులు ఇంటి తలుపులను గడ్డపలుగులతో పగులగొట్టి లోపలికి చొరబడి, బీరువాను ధ్వంసం చేసి అందులో ఉన్న ఒక మొబైల్ ఫోన్, సిల్వర్ నాణెం, చిల్లర నగదును అపహరించినట్లు బాధితులు తెలిపారు. అదనంగా గ్యాస్ స్టవ్, గ్యాస్ సిలిండర్, బియ్యం, కోడిగుడ్లు, మిక్సీ వంటి గృహోపకరణాలను కూడా దొంగిలించినట్లు వెల్లడించారు. విలువైన ఆభరణాలు సురక్షితంగా ఉండటంతో బాధితులు ఊపిరి పీల్చుకున్నారు.సమాచారం అందుకున్న పట్టణ ఎస్సై నాగరాజు పోలీసు సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో ఒక అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకోగా, అతని వద్ద నుండి కొన్ని దొంగిలించిన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## తారానగర్ రోడ్డు విస్తరణపై పునరాలోచించాలి

**రవికుమార్ యాదవ్**



తారానగర్ మార్చంట్ అసోసియేషన్ రవికుమార్ యాదవ్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న వ్యాపారి



తారా నగర్ మార్కెట్ ను పరిశీలిస్తున్న రవి కుమార్ యాదవ్

**శేరిలింగంపల్లి, విశాలభారతి:** తారానగర్‌లో ప్రతిపాదిత 100 అడుగుల రోడ్డు విస్తరణతో వేలాది కుటుంబాలు నష్టపోతాయని, ప్రభుత్వం పునరాలోచించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి,శేరిలింగంపల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం తుల్జా భవానీ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆయన చిరు వ్యాపారులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు.పోచమ్మ గుడి నుంచి హనుమాన్ గుడి వరకు 100 అడుగుల విస్తరణ వల్ల మూడు తరాలుగా కొనసాగుతున్న మార్కెట్ దెబ్బతింటుందని,దాన్ని 60 అడుగులకు కుదించాలని మర్చంట్స్ అసోషియేషన్ కోరినట్లు తెలిపారు.“వ్యాపారుల జీవనోపాధి దెబ్బతీయొద్దు.అన్యాయం జరిగితే బీజేపీ తరపున పోరాడతా”అని రవికుమార్ యాదవ్ హెచ్చరించారు. కార్యక్రమంలో బుచ్చిరెడ్డి,ఎల్లేష్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మియాపూర్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై సమీక్ష

**బీఎల్‌వోలు,సూపర్‌వైజర్లతో ఏఈఆర్‌వో సమావేశం..కీలక అంశాలపై దిశానిర్దేశం**



**శేరిలింగంపల్లి, విశాలభారతి:** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని మియాపూర్ సర్కిల్ 48 సీఎంసీ కార్యాలయంలో బుధవారం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏఈఆర్‌వో,డీసీ48 ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి బీఎల్‌వో సూపర్‌వైజర్లు (బీఎల్‌వోఎస్‌వోలు), బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) హాజరయ్యారు. ఎస్ఐఆర్‌కు సంబంధించి పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్,కుటుంబాల విభజన (ప్రొజెనీ) తదితర కీలక అంశాలపై సమావేశంలో చర్చించారు.ఓటర్ల జాబితాలో డూప్లికేట్ ఎంట్రీలు,మరణించిన వారి పేర్ల తొలగింపు,18 ఏళ్లు నిండిన కొత్త ఓటర్ల నమోదు,అడ్రస్ మార్పులు వంటి అంశాలపై బీఎల్‌వోలకు ఏఈఆర్‌వో దిశానిర్దేశం చేశారు.క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని,ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాబితాను సిద్ధం చేయాలని సూచించారు.బీఎల్‌వోలు ఎదుర్కొంటున్న సందేహాలను అధికారులు అక్కడికక్కడే నివృత్తి చేశారు.మ్యాపింగ్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని,ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలోని ఓటర్ల వివరాలు కచ్చితంగా ఉండేలా చూడాలని ఆదేశించారు.ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని ఏఈఆర్‌వో,డీసీ48 స్పష్టం చేశారు.

## మియాపూర్‌లో ఎమ్మెల్యే క్లీన్ స్వీప్ డ్రైవ్ ప్రారంభం

**పచ్చ జెండా ఊపి పనులకు శ్రీకారం..అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటన**



జెండా ఊపి క్లీన్ స్వీట్ డ్రైవ్ ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

**శేరిలింగంపల్లివిశాల భారతి** సైబరాబాద్ క్లీన్ స్వీప్ డ్రైవ్‌లో భాగంగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే బుధవారం ఉదయం మియాపూర్ సర్కిల్ 48లో పారిశుధ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు.మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సమీపంలో జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే స్వచ్ఛ సర్వేక్షణ్ లోగోతో ఉన్న పచ్చ జెండాను ఊపి డ్రైవ్‌కు శ్రీకారం చుట్టారు.జేసీబీలు,ట్రాక్టర్లు ,చెత్త సేకరణ వాహనాలను ఎమ్మెల్యే జెండా ఊపి క్షేత్రస్థాయిలోకి పంపారు. ఇంజనీరింగ్,టౌన్ ప్లానింగ్, హెచ్ఎండబ్ల్యూఎస్‌బీ,యూబీడీ అధికారులు,స్థానిక కార్పొరేటర్లు,పారిశుధ్య కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. యూబీడీ సిబ్బంది ఆరెంజ్ జాకెట్లతో,శానిటేషన్ వర్కర్లు స్ప్రేయింగ్ మిషన్లతో సిద్ధంగా ఉన్నారు.జెండా ఊపిన వెంటనే ఎమ్మెల్యే అధికారుల బృందంతో కలిసి కాలినడకన క్షేత్రస్థాయి పర్యటన ప్రారంభించారు.కృషి నగర్ నుంచి ప్రశాంత్ నగర్,జేపీఎన్ నగర్,స్టాలిన్ నగర్ మీదుగా బొల్లారం రోడ్డు వరకు పారిశుధ్య పనులను స్వయంగా పరిశీలించారు.దారి పొడవునా రోడ్లపై చెత్త,డ్రెయినేజీల్లో పూడిక, ఫుట్‌పాత్ ఆక్రమణలు,సీ&డీ వేస్ట్‌ను గుర్తించి అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ“స్వచ్ఛత ఒక్కరోజు కార్యక్రమం కాదు.మియాపూర్ సర్కిల్‌ను జీరో గార్బేజ్ ప్రాంతంగా మార్చేవరకు డ్రైవ్‌లు కొనసాగుతాయి.అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి. ప్రజలు కూడా చెత్తను రోడ్లపై వేయకుండా డస్ట్‌బిన్లలో వేసి సహకరించాలి”అని పిలుపునిచ్చారు.ఈ డ్రైవ్‌లో 150 మందికి పైగా పారిశుధ్య సిబ్బంది,40 మంది వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# అలియా భట్‌పై సోషల్ మీడియాలో దుమారం

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అలియా భట్ పేరు మరోసారి సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. అయితే ఈసారి కారణం కొత్త సినిమా కాదు... వివాదంతో. పాకిస్తాన్‌కు చెందిన ఓ ఫ్యాషన్ బ్రాండ్‌కు ఆమె బ్రాండ్ అంబాసిడర్ అయ్యిందంటూ వచ్చిన వార్తలు నెట్టింట పెద్ద చర్చకు దారితీశాయి. పాకిస్తాన్‌కు చెందిన "వజేషా అఫీషియల్" అనే క్లాతింగ్ బ్రాండ్ తమ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో అలియా భట్ ఫోటోలను షేర్ చేయడం ఈ వివాదానికి కారణమైంది. ఈ ఫోటోలలో అలియా వివిధ రంగుల ఎత్నిక్ వేర్‌లో లావెండర్, బ్లాక్, బర్గుండీ, ఎమరాల్డ్ టీల్ లో మెరిసిపోతున్నట్లు కనిపించింది.దీనికి తోడు "మా ప్యూర్ శీషా సిల్క్ కలెక్షన్ అలియా భట్‌కు కూడా ఇష్టం" అంటూ క్యాప్షన్ ఇవ్వడంతో నెటిజన్లు షాక్‌కు గురయ్యారు. నిజంగానే అలియా ఆ బ్రాండ్‌కు అంబాసిడర్ అయ్యిందా? అనే సందేహాలు వ్యక్తమయ్యాయి. ఈ పోస్టులు వైరల్ అవ్వడంతో, అలియా భట్‌పై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి.

## కొత్తగూడెంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర 3వ మహాసభలు

- **రైతుల సమస్యల పరిష్కారానికి మహాసభలు కీలకం**
- **రాష్ట్రవ్యాప్తంగా రైతుల భారీ పాల్గొనాలని పిలుపు**
- **పంటల ధరలు, రుణమాఫీ, సాగునీటి అంశాలపై చర్చలు**
- **మహాసభలకు అన్ని ఏర్పాట్లు పూర్తి దశలో**



**సత్తుపల్లి విశాలభారతి:** కొత్తగూడెం పట్టణంలో ఈనెల 23, 24, 25 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేయాలని సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి రావుల రాజబాబు పిలుపునిచ్చారు. మహాసభల ఏర్పాట్లను సమన్వయం చేస్తూ, కార్యక్రమానికి విచ్చేసే అతిథులు, రైతులను సాదరంగా ఆహ్వానిస్తూ ఈ మహాసభలు రైతుల సమస్యల పరిష్కారానికి ఒక ముఖ్య వేదికగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు, సంఘం ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభలను జయప్రదం చేయాలని కోరారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతుల హక్కుల పరిరక్షణ, పంటలకు సరైన ధరలు, సాగునీటి సదుపాయాల మెరుగుదల, రుణమాఫీ వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చలు జరగనున్నాయని తెలిపారు. వ్యవసాయ రంగ అభివృద్ధి, ప్రభుత్వ విధానాలపై సమగ్రంగా చర్చించి రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం ఈ మహాసభల ప్రధాన ఉద్దేశమని వివరించారు.మహాసభల విజయవంతానికి సంబంధించి ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయని, వసతి, భద్రత, రవాణా వంటి అన్ని సౌకర్యాలను సమకూరుస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. రైతులకు అనుకూల వాతావరణంలో సమావేశాలు నిర్వహించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.ఈ మహాసభలు రైతుల ఐక్యతను బలోపేతం చేసి, వారి సమస్యలకు స్థిరమైన పరిష్కారాల దిశగా ముందడుగు వేయడానికి దోహదపడతాయని నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మోరంపూడి వెంకట్రావు, కోలికపోగు సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

## యాచకులకు అండగా గురిజాల గోపి సేవా కార్యక్రమం

- **నిరాధారులకు కొత్త దుస్తులు, ఆర్థిక సహాయం**
- **సేవే నిజమైన ధర్మం యువతకు స్ఫూర్తిగా నిలిచిన మణుగూరు ఘటన**



**మణుగూరు, విశాలభారతి :** మణుగూరు మండలంలో మానవత్వం మరోసారి సజీవంగా నిలిచిన హృదయాన్ని కదిలించే సేవా కార్యక్రమం బుధవారం చోటుచేసుకుంది. రేణుక చౌదరి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమం సమాజంలో మానవ విలువలు ఇంకా నిలిచే ఉన్నాయనే నమ్మకాన్ని మరింత బలపరిచింది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన యాచకులు నిరాధారంగా, దిక్కు తోచని పరిస్థితుల్లో సహాయం కోసం ఎదురుచూస్తుండగా, స్థానిక నాయకులు ముందుకు వచ్చి వారికి అండగా నిలిచారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు గురిజాల గోపి నేతృత్వంలో ఈ సేవా కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. సమాజంలో వెనుకబడిన వర్గాలకు చేయూత అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమం అందరి ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా రేణుక అక్షర మహిళా మండలి సభ్యులు కూడా పెద్ద ఎత్తున పాల్గొని తమ సేవా భావాన్ని చాటుకున్నారు. యాచకులకు కొత్త దుస్తులు పంపిణీ చేయడమే కాకుండా, వారి తక్షణ అవసరాల కోసం ఆర్థిక సహాయం అందించడం ద్వారా వారికి కొంత ఊరటనిచ్చారు. ఈ సహాయం అందుకున్న వారు భావోద్వేగానికి లోనై తమ కృతజ్ఞతలు వ్యక్తం చేయడం కార్యక్రమానికి మరింత గంభీరతను తీసుకొచ్చింది. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ సమాజంలో ఉన్న పేదలు, నిరాధారులను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలు ఉన్నప్పటికీ, వ్యక్తిగతంగా కూడా సహాయం చేయడం ఎంతో అవసరమని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనం సరోజతో పాటు సభ్యులు ఎండి షబానా, కోరి శ్యామల, కన్నాపురం వసంత, రెడ్డిబోయిన రేణుక, కన్నాపురం శైలజ, బాడిష పార్వతి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఘనంగా సిపిఐ (ఎంఎల్) పార్టీ 57వ ఆవిర్భావ దినోత్సవం

- **నూతన పార్టీ గద్దె నిర్మాణం.. జెండా ఆవిష్కరణతో వేడుకలు**



**బయ్యారం విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం సింగారం గ్రామంలో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ 57వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతనంగా పార్టీ గద్దెను నిర్మించి, విప్లవోత్సాహంతో కార్యక్రమాలను చేపట్టారు. గ్రామ ప్రజలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను ఉత్సాహంగా జరిపారు. కార్యక్రమం ప్రారంభంలో పి.వై.ఎల్ జిల్లా నాయకులు గణేష్ పార్టీ జెండాను ఆవిష్కరించి, విప్లవ పోరాటాల ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోకన్నా హాజరై మాట్లాడుతూ, పార్టీ స్థాపన లక్ష్యాలు, ప్రజల హక్కుల కోసం సాగించిన పోరాటాలపై విశదీకరించారు. సమాజంలో అసమానతలను నిర్మూలించేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండపల్లి వెంకటేశ్వర్లు, పి.ఓ.డబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి శారు కవిత, సహాయ కార్యదర్శి చందా అరుణ, రాష్ట్ర నాయకురాలు భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొని పార్టీ చరిత్రను స్మరించారు. నాయకులు మాట్లాడుతూ, రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పార్టీ ఎప్పటికీ అంకితభావంతో పని చేస్తుందని తెలిపారు. గ్రామస్థులు, కార్యకర్తలు కలిసి నినాదాలతో గ్రామం మొత్తం మార్మోగేలా చేశారు. సట్ల యాకయ, వీరన్న, గోపి, లాల్యా, నరసయ్య తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ వేడుకలు గ్రామంలో విప్లవ చైతన్యాన్ని మరింత బలోపేతం చేశాయని నాయకులు పేర్కొన్నారు.

## కాంగ్రెస్ కుట్రలకు హైకోర్టు తీర్పు చెంపపెట్టు

**మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి**




**ఆర్మూర్, విశాలభారతి:** తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షగట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గౌరవ హైకోర్టు తీర్పు ఒక గట్టి 'చెంపపెట్టు' అని బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి అభివర్ణించారు. ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు స్టే విధించడాన్ని ఆయన పూర్తి స్థాయిలో స్వాగతించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. భారత రాజ్యాంగానికి, చట్టాలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా దేశంలోని గౌరవ న్యాయస్థానాలు చూస్తూ ఊరుకోవని ఈ తీర్పుతో మరోసారి రుజువైందని పేర్కొన్నారు. అది పీసీ ఘోష్ కమిషన్ కాదని, ముమ్మాటికీ కాంగ్రెస్ పార్టీ తయారు చేసిన పీసీసీ నివేదిక మాత్రమేనని తాము మొదటి నుంచి చెబుతున్న మాట బుధవారం అక్షరాలా నిజమైందని విమర్శించారు. ఘోష్ కమిషన్ విచారణలో సహజ న్యాయ సూత్రాలను పూర్తిగా విస్మరించడమే కాకుండా, నిబంధనలను తుంగలో తొక్కారని మా నాయకుడు కేసీఆర్ గతంలోనే స్పష్టం చేశారని, నేడు హైకోర్టు కూడా అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం హర్షణీయమన్నారు. రాజకీయ కక్షసాధింపు కోసం వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్న రేవంత్ సర్కారు తీరును ఈ తీర్పు ఎండగట్టిందని ఆయన మండిపడ్డారు. తెలంగాణకు కల్పతరువు లాంటి కాళేశ్వరం ప్రాజెక్టును గత రెండున్నరేళ్లుగా పడావు పెట్టిన రేవంత్ రెడ్డి.. ఇప్పటికైనా ముక్కు నేలకు రాసి, రాష్ట్రంలోని అన్నదాతలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇకనైనా రాజకీయ కుట్రలు పక్కన పెట్టి రైతన్నల క్షేమం కోసం పని చేయాలని జీవన్ రెడ్డి సూచించారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే మేడిగడ్డ బ్యారేజిలో స్వల్పంగా దెబ్బతిన్న రెండు పిల్లర్లను రిపేర్ చేసి, రాష్ట్రంలోని లక్షలాది మంది రైతుల సాగునీటి కష్టాలు తీర్చాలని కోరారు. రాజకీయ క్రీడ కంటే రైతుల ప్రయోజనాలే ముఖ్యమని హితవు పలికారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.